ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



వికారాబాద్

బుధవారం 30 ఆగస్టు 2017 | 20





తాండూరులో నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య

గంగమ్మ ఒడికి..

ఐదు రోజులు పూజలందుకున్న గణపయ్యకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వీడ్కోలు పలికారు. ఓ బొజ్జగణపయ్య.. నీ బంటు మేమయ్యాఅంటూ..పాటలతో నృత్యాలు చేస్తూ గణనాథునికి కన్నుల పండువగా శోభయాత్ర నిర్వహించారు. అనంతరం గంగమ్మ ఒడికి చేర్చారు. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజక వర్గాల్లో ఆయా పట్టణాలు, గ్రామాల్లో ప్రతిష్ఠించిన 750 వరకు లంబోదరులను సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. తాండూరులో నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమానికి మంత్రి మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. తాండూరు వినాయకోత్సవాల్లో ఈసారి ప్రత్యేకత కనిపించింది. యాదిరెడ్డి చౌక్ సమీపంలో జడ్పీటీసీ రవీందర్‌గౌడ్ ఇంటి వద్ద ప్రతిష్ఠించిన వినాయకునికి మహారాష్ట్ర పూణెకు చెందిన 80 మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ విద్యార్థులు బ్యాండు మోగించి ఆకర్షణగా నిలిచారు.

- వివరాలు లోపలి పేజీల్లో

'రూర్బన్' పూర్తి చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

- జిల్లాలో 46.583 హెక్టార్లలో పత్తిసాగు
- నవంబర్‌లో పంట చేతికి
- సమీక్ష సమావేశాల్లో కలెక్టర్ దివ్య

7లో

పల్లె పదవులు

రైతు సమన్వయ సమితులు

- గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నామినేటెడ్ పోస్టులు
- 9660 మంది సభ్యుల ఎంపిక
- మూడో వంతు మహిళలకు కేటాయింపు
- అధికార పక్షం ఆనందం
- భగ్గుమన్న ప్రతిపక్షం

20



నీలి విప్లవానికి.. వరుణ గండం

చేప పిల్లల పంపిణీకి పెద్ద కష్టం వచ్చింది.. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి సరిపడా నీరు చేరుకోకపోవడంతో చేప పిల్లల పంపిణీకి ఇబ్బందికరంగా పరిణమించింది. వరుణుడు కరుణించకపోవడంతో సాగునీటి వనరులు, చెరువులు, కుంటలు నీరు లేక వెలవెలబోతున్నాయి.

11

- ఇక పక్కాగా ఎరువుల అమ్మకాలు..
- రేపటిలోపు పీఓఎస్‌ల ఏర్పాటుకు ఆదేశం
- ఎరువుల అనుసంధానంతో అక్రమాలకు చెక్
- నేరుగా రాయితీ బదిలీ పథకానికి చర్యలు
- ఈ-పాస్ ద్వారానే అమ్మకాలు చేపట్టాలని ఆదేశాలు





7

పీవోఎస్‌ల ఏర్పాటుకు 31 గడువు

రైతులు కొనుగోలు చేసే ఎరువులకు ఆధార్‌ను తప్పని సరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానం జూన్ 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చినా పీవోఎస్‌లు అందుబాటులోకి రాకపోవడంతో జాప్యం జరిగింది. దీంతో ఈ నెల 31లోగా ప్రతి ఫెర్టిలైజర్ దుకాణదారుడి వద్ద పీవోఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) మిషన్ తప్పక ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మిషన్లను అందజేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వం కొన్ని కంపెనీలకు అప్పగించింది. అయితే గడువులోగా ఆయా కంపెనీలు మిషన్లను దుకాణాదారులకు అందజేయలేకపోయాయి. దీంతో ప్రభుత్వం తిరిగి రేపటిలోగా మిషన్‌లను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశాలు జారీ చేసింది. ఎరువుల అమ్మకాలను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకురావాలని అధికారులు పీవోఎస్‌ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నారు.



ఆంధ్రజ్యోతి / ఇంటర్వ్యూ

మహిళలకు వ్యాపారాల్లో ప్రోత్సాహం

● గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా పలు యూనిట్లు

● స్వయం సహాయక గ్రూపు సభ్యులకు అవగాహన

● డీఆర్డీవో డీపీఎం శీలం ప్రభాకర్, మేడ్చల్ జిల్లా



కీసర రూరల్ : మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. వృత్తి విద్యా కోర్సులు చేయని మహిళలకు సైతం పలు వ్యాపారాల్లో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏడో తరగతికి పైగా చదువుకున్న వారికి ఆర్థికంగా చేయూతనందించేందుకు డీఆర్‌డీఏ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా.. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)ల ద్వారా పలు వ్యాపారాలు చేసేందుకు వీలుగా శిక్షణను అందిస్తున్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళల కోసం చేపడుతున్న పలు కార్యక్రమాలపై జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శీలం ప్రభాకర్ 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మహిళలల్లో ఆర్థిక చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తుంది. ఇందులో భాగంగా జిల్లాకలెక్టర్ ఎం.వి.రెడ్డి, డీఆర్డీవో కౌటిల్య ఆదేశాలతో జిల్లాలో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు పలు వ్యాపారులపై అవగాహన కల్పిస్తున్నాం. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు గానూ 2990 జీవనోపాధులను గుర్తించాం. 2017-18 సంవత్సరానికి గానూ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నాం. జిల్లాలో మొత్తం దాదాపు 2,433 ఎస్‌హెచ్‌జీలు ఉన్నాయి. వీటిలో 4,308మంది సభ్యులు ఉన్నారు. రూ.3.87 కోట్లు వరకు జీవోనోపాధులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వ్యాపార, వాణిజ్య రంగాల్లో మహిళలను అభివృద్ధి పరిచేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం. ప్రతి సంఘానికి వారివారి అభిరుచుల మేరకు వ్యాపారం చేసేందుకు ఆర్థిక రుణాలు ఇవ్వడం జరుగుతుంది. జిల్లాలో ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఎలాంటి వ్యాపారం చేస్తారన్న దానిపై వివరాలు సేకరిస్తున్నాం. కిరాణ దుకాణాలు, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, తెలంగాణ వంటకాలు, జూట్ బ్యాగుల తయారీ, డిస్పోజబుల్ ప్లేట్స్ తయారీ తదితర కుటీర పరిశ్రమలు నెలకొల్పేందుకు రుణాలు మంజూరు చేస్తున్నాం. ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలో స్థాపిస్తున్న కొత్త యూనిట్ల మంజూరు చేయడంతో పాటు వారికి ఆయా వ్యాపారాల్లో అనుభవం ఉన్నవారి చేత తగిన శిక్షణను ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈసంఘాల ద్వారా ఉత్పత్తయ్యే ప్రతి వస్తువును కూడా అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రదర్శించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన పలు వస్తువులను తయారు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. అన్ని కార్యాలయాల అధికారులకు లేఖలు రాయనున్నాం. జిల్లాలో ఇప్పటివరకు అధికంగా ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాలవ్యాపారం, కుట్టుమిషన్లు, కిరాణా షాపులకే పరిమిత మయ్యారు. కొత్త యూనిట్ల మంజూరు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో, జిల్లాలోని స్వయం సంఘాల సభ్యులకు వ్యాపారాలపై అవగాహన కల్పించి, జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

రైతులకు మేలు చేకూర్చే సహజ వ్యవసాయం

● పర్యావరణ పరిరక్షణ, నాణ్యమైన దిగుబడులు

● రైతులు దృష్టి సారించాలంటున్న నిపుణులు

వ్యవసాయం



సహజ వ్యవసాయంతో సాగు చేసిన క్యారెట్ పంట

చేవెళ్ల రూరల్ : రోజు రోజుకు వ్యవసాయంలో కలుగుతున్న పలు నష్టాలను దృష్టిలో ఉంచుకుని రైతులు సహజ వ్యవసాయం వైపు దృష్టి మరల్చాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు, నాణ్యమైన దిగుబడులను సాధించేందుకు ఇది తప్పనిసరని చెబుతున్నారు. 1935 సంవత్సరంలోనే జపాన్‌కి చెందిన మొకిచి బకాడ రసాయనాలు వాడే సాగుపద్ధతికి ప్రత్యామ్నాయంగా సహజ వ్యవసాయాన్ని ప్రతిపాదించారు. సురక్షితమైన ఆహారాన్ని పండించడమే సహజ వ్యవసాయ లక్షణం అయితే సహజ వ్యవసాయం సాగుపై రంగారెడ్డి జిల్లా చేవెళ్ల డివిజన్ ఆత్మ బీటీఎం ఆర్. లక్ష్మణ్‌రావు రైతులకు పలు సూచనలు చేశారు.

బీజామృతంతో విత్తనశుద్ధి..

కావలసిన పదార్థాలు: నీరు- 20 లీటర్లు, దేశీయ ఆవుపేడ- 10 కిలోలు, దేశీయ ఆవు మూత్రం-5 లీటర్లు, గుప్పెడు పొలంపై పొరలోని మట్టి సున్నం 50 గ్రాములు, ఈ పదార్థాలతో తయారు చేసే మిశ్రమాన్ని బీజామృతం అంటారు. బీజామృతంలో విత్తనాలను, నారును నాటడానికి ఉపయోగించే మొక్క భాగాలను ముంచి తీసి నాటుకోవచ్చు. పంట మొదటి దశలో భూమిలో నివసించే శిలీంధ్రాల నుంచి మొక్కలను బీజామృతం రక్షిస్తుంది.

పంటలపై జీవామృతం చల్లటం...

కావాల్సిన పదార్థాలు నీరు-200 లీటర్లు, దేశీ ఆవుపేడ -10 కిలోలు, దేశీయ ఆవు మూత్రం - 10 లీటర్లు. బెల్లం - 2 కిలోలు, పప్పుల పొడి-2 కిలోలు, పొలం నుంచి లేదా అడవి నుంచి తీసుకున్న చేతి నిండా మట్టి ఈ పదార్థాలతో తయారు చేసిన మిశ్రమం ఒక ఎకరంలో పంటపై పిచికారి చేయడానికి సరిపోతుంది. జీవామృతం పంటపై 15 రోజులకొకసారి పిచికారీ చేయాలి. జీవామృతం ఎలాంటి పోషక పదార్థం కాదు, భూమిలోని సూక్షజీవులను వృద్ధి చేయడానికి మాత్రమే ఉపయోగపడుతుంది.

ఆవుపేడ, ఆవుమూత్రం, వేపాకులు, వేప విత్తనాలు, వెల్లుల్లి, పచ్చి మిరపకాయల పేస్ట్ వీటిని ఉపయోగించి రైతులు తామే శిలీంధ్ర నాశినులను, కీటక నాశినులను స్వయంగా తయారు చేసుకోవచ్చు. పురుగులు, తెగుళ్ల ఆశించక ముందుగాని, ఆశించిన తర్వాత గాని పిచికారీ చేసుకోవచ్చు.

సహజ వ్యవసాయంలో ముఖ్యాంశాలు..

● సహజ వ్యవసాయంతో కలుపు మందులు వాడరు.

● సహజ వ్యవసాయంలో భూమిని దున్నరు. యంత్రాలకు బదులుగా వాన పాములు, సూక్షజీవులు, చిన్నజీవులను వాడతారు.

● సాధారణంగా పంటలకిచ్చే నత్రజని, భాస్వరం, పొటాషియం, కాల్షియం వంటి రసాయన పోషకాల బదులు సహజ వనరులను పంటకు అందిస్తారు. చేపల ఎమినోయాసిడ్స్ నత్రజని, కోడి గుడ్డు పెంకులు కాల్షియాన్ని, పశువుల ఎముకలు భాస్వరాన్ని అందిస్తాయి. ఈ సహజ వనరులు చౌకే కాక సమర్థవంతంగా పనిచేస్తాయి.

● సహజ వ్యవసాయంలో వాతావరణ కాలుష్యం ఉండదు.

● సహజ వ్యవసాయంలో ముఖ్యమైన విషయం రైతులే తమకు కావాల్సిన వనరులను తయారు చేసుకుంటారు. ఎరువులు, భూమిలో సూక్ష్మజీవులను వృద్ధిపరిచే పదార్థాలు, కీటకనాశినులు, శిలీంధ్ర నాశినులను సహజ వనరులను ఉపయోగించుకుని తమంతట తామే తయారు చేసుకుంటారు.



రైతులకు అవగాహన కల్పించాలి

గ్రామాల్లో రైతులకు సహజ వ్యవసాయంపై అధికారులు అవగాహన కల్పించాలి. రసాయనిక ఎరువులు అధికంగా వేయడంతో రైతులకు ఆర్థిక భారం పెరుగుతుంది. ఇదివరకు సహజ వ్యవసాయం చేసినప్పటికీ రైతులు రసాయనిక ఎరువులు ఉపయోగించడంతో సహజ వ్యవసాయానికి విరామం పలికారు.

-గజేందర్‌గౌడ్, భారతీయ కిసాన్ సంఘ్ మార్కెటింగ్ విభాగం అధ్యక్షుడు




రైతులకు ఎంతో మేలు

సహజ వ్యవసాయం ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు నాణ్యతతో కూడిన దిగుబడులను ఉత్పత్తి చేయవచ్చు. రైతులు సహజ ఎరువులకు ప్రాధాన్యతనివ్వాలి. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

-లక్ష్మణ్‌రావు, చేవెళ్ల డివిజన్ ఆత్మ బీటీఎం

భక్తుల ఇలవేల్పు బాలాత్రిపురసుందరీదేవీ



యాచారం : రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో బాలాత్రిపురసుందరీదేవీ భక్తుల పాలిట ఇలవేల్పుగా ఉన్నారు. గ్రామంలో నిత్యం భక్తుల పూజలందుకుంటున్నారు. ఇక్కడ అమ్మవారికి మహిళలు ఉదయం వేళ ప్రత్యేక పూజలు చేస్తుంటారు. శ్రావణమాసంలో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయాన్ని మాజీ సర్పంచ్ లచ్చి రెడ్డి గ్రామస్థుల సహకారంతో నిర్మించారు. ఆలయానికి సెంటు భూమి లేకున్నా అమ్మవారికి భక్తుల విరాళాలతో పూజలు చేస్తున్నారు. అమ్మ వారి ఆలయం పక్కనే వినాయకుడు, శివుడు వెలియడంతో నిత్యం ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంటుంది. వచ్చే కార్తీకమాసంలో 40 రోజుల పాటు ఆలయంలో రాత్రి 8 గంటల నుంచి 12 గంటల దాక భజనలు చేస్తారు. అమ్మవారికి పూజలు చేస్తే తమ కోరికలు తీరుతాయని గ్రామస్థులు చెప్పారు. తాతల కాలం నుంచి అమ్మవారిని సేవిస్తున్నారు. అమ్మవారి ఆలయాన్ని దేవాదాయ శాఖ దత్తత తీసుకొని ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సీపీఎస్ రద్దుకు 1న సామూహిక సెలవు

● జనార్దన్‌రెడ్డి, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగవర్గం



షాద్‌నగర్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలుపరుస్తున్న కంట్రిబ్యూషన్ పింఛన్ స్కీం (సీపీఎస్)ను రద్దుచేసి పాత పద్ధతిలోనే పింఛన్ ఇవ్వాలని సెప్టెంబర్ 1న సామూహిక సెలవు పెట్టి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నాం. 2004 సెప్టెంబర్ నుంచి నియమించబడిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఎలాంటి ఉద్యోగ భద్రతను ఇవ్వడం లేదు. మధ్యలో చనిపోతే ఎలాంటి ఆర్థిక సహాయం చేయడం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం 12 లక్షల రూపాయలను మరణ పరిహారంగా ఇస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం కూడా మరణ పరిహారం ఇవ్వడమే కాకుండా పాత పద్ధతితోనే పింఛన్ విధానాన్ని కొనసాగించాలి. ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా చేపడుతున్న సామూహిక సెలవులు, నిరసన కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యులు కూడా పాల్గొని మద్దతు ఇవ్వాలి.

ఉపాధి హామీలో అవినీతి

తాండూరు రూరల్ : తాండూరు మండలంలోని 25 గ్రామపంచాయతీలు, 8 అనుబంధ గ్రామాల్లో జరిగిన సామాజిక తనిఖీలో సుమారు రూ.2లక్షల వరకు అక్రమాలకు పాల్పడినట్లు తేలిందని జిల్లా ఎన్‌ఆర్‌ఈజీఎస్ అడిషనల్ పీడీ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ఆయన మాట్లాడారు. తాండూరు మండలంలో సోమవారం అర్ధరాత్రి వరకు సామాజిక తనిఖీ నిర్వహించగా, 10 నుంచి 12 గ్రామ పంచాయతీల్లో దాదాపు రూ. 2 లక్షలవరకు అక్రమాలు జరిగినట్లు వెలుగులోకి వచ్చిందని తెలిపారు. గ్రామాల్లో సకాలంలో పనులు కల్పించకపోవడం, పనిచేసిన కూలీలకు రికార్డులు తక్కువ చేయడం, మస్టర్లపై సంతకాలు చేయకపోవడం, సకాలంలో రికార్డులు తనిఖీ బృందంకు ఇవ్వకపోవడం, తక్కువ పనిచేస్తే ఎక్కువ రికార్డులు చేయడం, పనిచేయని వారిని చేసినట్లు రికార్డుల్లో చూపించడం, మండలంలోని గోనూరు గ్రామంలో కూలిబోయిని చంద్రప్ప 2015 లో మృతి చెందితే, 2016లో పనిచేసినట్లు కూలీ డబ్బులు రికార్డు చేయడం వంటి పొరపాట్లు వెలుగులోకి వచ్చాయి.

వీటిపై అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఏపీవో శారదకు చార్జ్ మెమో ఇచ్చినట్లు తెలిపారు. టీఏ, ఎఫ్ఏ, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి పూర్తిస్థాయిలో విచారణ జరిపి దాదాపు రూ.2లక్షల వరకు రికవరీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రికవరీకి సహకరించని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



ఉపాధి హామీ పనులపై ప్రశ్నిస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ అడిషనల్ పీడీ వేణుగోపాల్

పాఠకులకు సూచన:

క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు.

బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.

పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

\- మేనేజర్

మామిడితోటలో వ్యక్తి మృతి

పూడూరు : కట్టెల కోసం వెళ్లి ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం మండల పరిధిలోని రాకంచర్లలో జరిగింది. రాకంచర్ల గ్రామానికి చెందిన బధ్యానాయక్(44)కు మతి స్తిమితం లేదు. పిచ్చిగా ప్రవర్తించేవాడు. కట్టెలకు వెలుతున్నానని చెప్పి సోమవారం ఇంటి నుంచి బయలుదేరాడు. రాత్రయినా ఇంటికి రాలేదు. వృద్ధురాలైన తల్లి బంధువుల వద్ద, తెలిసినవాళ్ల వద్ద, గ్రామంలోనూ వెదికినా ఫలితం లేకపోయింది. అయితే మంగళవారం రాకంచర్ల మామిడి తోటలో మృతి చెంది ఉండటాన్ని చూసిన పశువుల కాపరులు గ్రామస్థులకు తెలిపారు. మతిస్థితమితం లేని అతడికి అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుండేవనీ, చిన్నపాటి వర్షం కురుస్తుండటంతో ఫిట్స్ వచ్చి చనిపోయి ఉండవచ్చని గ్రామస్థులు తెలిపారు. వృద్ధురాలైన అతడి తల్లిని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

తాండూరు రూరల్ : సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు పోయాయనే మనోవేదనతో ఓ నిరుద్యోగ యువకుడు గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన తాండూరు రైల్వే స్టేషన్‌లో మంగళవారం తెల్లవారు జామున జరిగింది. రైల్వే ఎస్ఐ వెంకట్‌రాంనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. కొడంగల్ ప్రాంతానికి చెందిన నవాజ్‌బాబా అలియాజ్ ఇమ్రాన్(21) కొంత కాలంగా తాండూరు పట్టణంలోని ఫాతిమా మజీద్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల కారు డ్రైవర్‌గా పనిచేస్తూ ఇతర దేశానికి వెళ్లేందుకు పాస్‌పోర్టు విసా సిద్ధం చేసుకున్నాడు. ఈ క్రమంలో సర్టిఫికెట్లు హైదరాబాద్ లో పోగొట్టుకున్నాడు. ఈ విషయమై హైదరాబాద్ నగరంలోని ఆసిఫ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో సర్టిఫికెట్లతోపాటు పాస్‌పోర్టు పోయిందని ఫిర్యాదు చేశాడు. సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు పోయాయని మనోవేదన చెంది మంగళవారం తెల్లవారు జామున గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అతడి దగ్గర లభించిన ఆధారాలతో కుటుంబీకులకు సమాచారం అందించినట్లు చెప్పారు. మృతదేహాన్ని తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబీకులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

'పాడిపశువుల ఆరోగ్యంతోనే పాల దిగుబడి'

కులకచర్ల: పాడిపశువులు ఆరోగ్యంగా ఉంటేనే నాణ్యమైన పాల దిగుబడి ఉంటుందని ఎరిటేజ్ రీజినల్ హెడ్ నరోత్తంరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పుట్టపహడ్‌లో మంగళవారం హెరిటేజ్ రైతు సంక్షేమనిధి, హెరిటేజ్ ఫుడ్స్‌లిమిటెడ్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో పశువులకు ఉచిత వైద్యంతో పాటు సబ్సిడీపై దాణా, పాలక్యాన్లు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో హెరిటేజ్ రైతు సంక్షేమ నిధి హెడ్ శ్రీనివాస్, ప్లాంట్ ఇన్‌చార్జ్ బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ



అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

దయాకర్, ఎన్కెపల్లి సర్పంచ్

పూడూరు: ఎన్కెపల్లి గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ దయాకర్ అన్నారు.

ప్ర: గ్రామ అభివృద్ధికి మీరెలాంటి చర్యలు చేపడుతున్నారు.?

జ: మౌలిక వసతులకల్పనలో భాగంగా ఇప్పటికే సీసీ రోడ్లు, మురుగుకాలువలు, తాగునీటి వసతి కల్పించాం. పంచాయతీలో ఏ ఒక్క వార్డులో ఏ చిన్న సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నా.

ప్ర: 2017-18 సంవత్సరానికి గాను 14 ఆర్థికం సంఘం, రాష్ట్ర ఆర్థిక సంస్థ నిధులెన్ని మంజరయ్యాయి.?

జ: ఈ ఏడాది గాను 14 ఆర్థిక సంఘం నిధులు రూ.3,31313లు, రాష్ట్ర ఆర్థిక సంస్థ నిధులు రూ. 6,794లు మంజూరయ్యాయి. సీసీరోడ్లు, బోరు మోటర్లు, సింగిల్‌పేజ్ మోటర్లు తదితర పనులకు నిధులు ఖర్చు చేయనున్నాం.

ప్ర: ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా?

జ: సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తున్నా.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

కులకచర్ల: మండల పరిధిలోని అంతారం పాఠశాలలో ఎంఈవో అబీబ్‌అహ్మద్ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని పలురకాల రిజిష్టర్‌లను ఆయన పరిశీలించారు. విద్యార్థులచే రాయించి చదివించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మరింత నాణ్యతగా అందించాలని ఏజెన్సీ మహిళలకు సూచించారు. అనుమతి లేకుండా విధులకు గైరాజరైతే చర్యలు తీసుకుంటామని ఉపాధ్యాయులకు తెలిపారు.

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్

పరిగి: క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉందని మండల విద్యాధికారి కె.అంజిలయ్య అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం పరిగిలో టార్చ్‌లైట్‌ను వెలిగించి ఎంఈవో ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ, విద్యతోపాటు, క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ఆంజనేయులు, భాస్కర్, పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తున్న పార్టీలు

- మండలంలో రోజురోజుకు వేడెక్కుతున్న రాజకీయాలు
- సింగిల్‌విండో ఛైర్మన్ పదవిని దక్కించుకునేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్న ఆయా పార్టీలు



కులకచర్ల: కులకచర్ల మండలంలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ఆయా పార్టీ నాయకులు ముందస్తు కార్యాచరణ రూపొందిస్తున్నారు. సింగిల్‌విండో ఛైర్మన్ పదవిని దక్కించుకునేందుకు అధికార పార్టీ నాయకులు వ్యూహాలు వేస్తున్నారు. ఈ సారి కూడా ఛైర్మన్ పదవిని దక్కించుకుని హ్యాట్రిక్ కొట్టాలని ప్రస్తుత ఛైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు భీంరెడ్డి తనదైన శైలిలో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాడు. ముందుగా స్థానిక సంస్థల ఎన్నికలు జరిపించేందుకు ప్రభుత్వం ఎదురుచూస్తుంది. దాంతో మండలంలో ఆయా పార్టీ నాయకులు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే గ్రామాలలో ఏ నలుగురు కూడినా రిజర్వేషన్ల ప్రక్రియ పై చర్చించుకుంటున్నారు. ఏ అభ్యర్థి బరిలో ఉంటే గెలిచే అవకాశాలు ఉంటాయని బేరీజులు వేస్తున్నారు. అధికార టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల నాయకులు ముందస్తు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఏ రిజర్వేషన్ వస్తే ఏ అభ్యర్థిని పోటీ చేయించాలని అన్ని వర్గాల నాయకుల పేర్లు సేకరిస్తున్నారు. ఎన్నికలకు ముందు మండలంలో పలు పార్టీల నాయకులు రంగులు మార్చే అవకాశం కనిపిస్తుంది. అధికార టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరేందుకు పలువురు నాయకులు ఉత్సాహం చూపుతున్నట్లు తెలిసింది. వారిని నివారించేందుకు టీఆర్ఎస్ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు ప్రహ్లాద్‌రావు మండలానికి చెందిన వ్యక్తి కావడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని గ్రామాల వారిగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. మండలంలో రాజకీయాలు రోజురోజుకు వేడెక్కుతున్నాయి.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పి.చంద్రయ్య

పరిగి: 15 ఏళ్లలోపు పిల్లలందరికీ వ్యాధినిరోధక టీకాలు తప్పకుండా టీకా వేయించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం పరిగి పట్టణంలోని సుధీక్ష స్కూల్‌లో విద్యార్థులకు నట్టల నివారణ, రుబెల్లా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 9 నెలలు పైబడిన 15 సంవత్సరాల లోపు విద్యార్థులకు ఈ వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయాలని సూచించారు.



వ్యాక్సిన్ వేయిస్తున్న చంద్రయ్య



ఘటనపల్లి పాఠశాలలో..

పూడూరులో...

పూడూరు: తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరి ఎంఆర్ టీకాలు వేయించుకోవాలని చింతలపల్లి సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ నర్సింలు, డాక్టర్ పాతిమా పేర్కొన్నారు. మంగళవారం పూడూరు మండల పరిధిలోని చింతలపల్లి పాఠశాలలో, అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది మీజిల్స్, రుబెల్లా టీకాలు పంపిణీ చేశారు.

దోమలో...

దోమ: చిన్నారులకు మీజిల్స్, రుబెల్లా వ్యాధులు రాకుండా ముందుజాగ్రత్తగా వ్యాధినిరోధక టీకాలు వేయడం హర్షనీయమని పోతిరెడ్డి పల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భీమయ్య, వైద్య సిబ్బంది కేశవులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎంఆర్ టీకాలు వేశారు. వారు మాట్లాడుతూ, 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలందరికి టీకాలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కులకచర్లలో...

కులకచర్ల: మండల పరిధిలో ఎంఆర్ టీకాలు వేసే కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని టీఎస్‌వో చంద్రప్రకాష్ తెలిపారు. మంగళవారం ఘటనపల్లి, సిబ్యానాయక్‌తండ, మక్తవెంకటాపూర్ తదితర పాఠశాలల్లో మీజిల్స్, రుబెల్లా టీకాలు వేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సెప్టెంబర్ 25 వరకు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు.మండల పరిధిలో ఇప్పటి వరకు 70 శాతం టీకాలు వేసే కార్యక్రమం పూర్తయిందని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తాం

టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు హరీశ్వర్‌రెడ్డి



ఎస్‌జీఎఫ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హరీశ్వర్‌రెడ్డి

పరిగి: క్రీడాకారులను అన్ని రకాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తామని టీఆర్ఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడు కె.హరీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పరిగిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యాలయాన్ని హరీశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, టీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడల కోసం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుదని తెలిపారు. క్రీడా పోటీలు నిర్వహిస్తే తమ వంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఉద్యోగ నియామకాల్లో కూడా క్రీడాకారులకు రిజర్వేషన్ల వసతి కల్పిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆర్.ఆంజనేయులు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భాస్కర్, మాజీ ఎంపీటీసీ ఎ.సురేందర్, పీడీలు గాంగ్యానాయక్ పాల్గొన్నారు.

'రైతు సమన్వయ సమితుల ఏర్పాటులో ముందుండాలి'

దోమ: గ్రామీణ స్థాయిలో రైతు సంఘాలలో ముందుడి కమిటీలు వేయించాలని టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు హరీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దోమ మండల టీఆర్ఎస్ పార్టీ నాయకులతో సమవేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, టీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో రైతులను గుర్తించి సంఘాలు ఏర్పాటు చేయడం కోసం కింది స్థాయి నాయకులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, ఎంపీపీ వెంకటయ్య, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, టీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలి: ఎంపీడీవో

కులకచర్ల: మండల పరిధిలో ఎంపిక చేసిన గ్రామాలలో నెల రోజుల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్, సెర్ఫ్ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి మొదటి విడతగా 18 గ్రామాలను ఎంపిక చేశామని ఈ గ్రామాలలో నెల రోజుల్లో పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టాలన్నారు. గ్రామానికో అధికారిని నియమిస్తున్నామని ఈజీఎస్, సెర్ఫ్ సిబ్బంది బాగస్వాములై నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ, ఈజీఎస్,సెర్ఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలని వినతి

పరిగి: పరిగి పట్టణంలో ప్రమాదబరితంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ, సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం పరిగి డిప్యూటీ తహసీల్దార్ గోవిందమ్మకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ డివిజన్ కార్యదర్శి ఫీర్‌మహ్మద్, మండల కార్యదర్శి ఎం.వెంకటేశ్ మాట్లాడుతూ, పట్టణంలోని రోడ్లపై గుంతలు ప్రమాదకరంగా మారని తెలిపారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం



ముజాహిద్‌పూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

పరిగి: పరిగి పట్టణంలో ప్రతిష్ఠించిన పలు విగ్రహాలకు మంగళవారం నిమజ్జనం చేశారు. శ్రీసాయి ట్రావెల్స్, ట్యాక్సీ కార్ల సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకులను ఊరేగింపు అనంతరం లక్నాపూర్ ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో భాస్కర్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ముజాహిద్‌పూర్‌లో..

కులకచర్ల: మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో శివాలయం దగ్గర ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనం చేశారు. అలంకరించిన ట్రాక్టర్ పై వినాయకుని విగ్రహం ఏర్పాటు చేసి గ్రామంలోని వీదుల గుండా ఊరేగింపు అనంతరం నిమజ్జనం చేశారు.

భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

పూడూరు: గణేష్ శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని టీఆర్ఎస్ సీనియర్ నాయకులు కె.అనిల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మన్నెగూడలో హనుమాన్ మందిర్ దగ్గర ప్రతిష్ఠించిన వినాయకుడిని సందర్శించి పూజలు చేశారు.



మన్నెగూడలో గణేష్ ఉత్సవకమిటీ సభ్యులతో

'1న సామూహిక దీక్షకు తరలిరండి'

పరిగి: సీపీఎస్ రద్దుకు సెప్టెంబర్ ఒకటిన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సామూహిక దీక్షకు భారీగా తరలిరావాలని టీఎస్ సీపీఎస్ఈఏ మండల అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, బి.నరసింహారాజ కోరారు. మంగళవారం పరిగిలోని నెం.01 పాఠశాలలో సన్నహాక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పి.సత్యానారాయణరెడ్డి, జాక వెంకటేశం, విజయ్‌కుమార్, బి.శ్రీనివాస్, సీపీ యాదయ్య, జి,యాదగిరి, లక్ష్మీనర్సింహులు, రఘువీర్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూడూరు: సీపిఎస్ రద్దు ఉద్యమాలకు, సామూహిక సెలవుకు పీఆర్‌టీయూటీఎస్ పూర్తి మద్దతునిస్తున్నట్లు ఆ సంఘ మండల ప్రధాన కార్యదర్శి డి. రాఘవేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.



గ్రామీణ ప్రాంతాల్లోని అట్టడుగు వర్గాలకు దీన్‌దయాళ్ గ్రామీణ యోజన పథకం కింద రూ.125కే విద్యుత్ మీటర్‌ను అందించడం హర్షణీయమని బీజేపీ నాయకులు కూరవెంకటయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దేవరఫస్లాబాద్ గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, బాలమ్మ, వెంకటప్ప, సుమిత్రమ్మ, లక్ష్మీ, దస్తప్ప పాల్గొన్నారు. - **దౌల్తాబాద్**

వింత రోగాలతో గొర్రెల మృత్యువాత

- బొంరాస్‌పేట్ పశువైద్యశాలలో మందులు కరువు
- దృష్టిసారించని సంబంధిత అధికారులు

బొంరాస్‌పేట్: ప్రభుత్వం మాంస ఉత్పత్తులను పెంచేందుకు కురుమ గొల్ల యాదవులకు ప్రతిష్టాత్మకంగా గొర్రెలను పంపిణీ చేసినా వాటికి వచ్చే రోగాలను మర్చిపోయారు. వింత రోగాలకు గురైన గొర్రెలు రోజుకోకటి చొప్పున మృత్యువాత పడుతున్నాయి. గొర్రెలను వింత రోగాల బారిన పడకుండా కాపాడుకోలేక గొర్రె కాపరులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అందించిన సబ్సీడి గొర్రెలకే కాకుండా ముందుగానే ఉన్న గొర్రెలకు సైతం ప్రతి సంవత్సరం రెండు దఫాలుగా నట్టల నివారణ మందులను మాత్రమే అందిస్తున్నట్లు సమాచారం. వర్షాకాలం కావడంతో వింత రోగాల బారిన పడి గొర్రెలు మృతి చెందడంతో ఆందోళనకు గురి చేస్తుంది. బొంరాస్‌పేట్ మండల వ్యాప్తంగా బొంరాస్‌పేట్‌తో పాటు కొత్తూర్, మహంతీపూర్, తుంకిమెట్ల, నాందర్‌పూర్ గ్రామాల్లో గొర్రెలను పంపిణీ చేశారు. బొంరాస్‌పేట్‌లోనే 70 యూనిట్లకుపైగా గొర్రెలను అందించారు.

మృత్యువాత పడుతున్న గొర్రెలు...

ప్రతి యూనిట్‌లో ఇప్పటికే కర్నాటక నుంచి తరలించే సమయంలోనే గొర్రెలు అలసిపోయి రోగాల బారిన పడుతూ మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గాలికుంటు వ్యాధితో పాటు అమ్మతల్లి, విచిత్రమైన మూతి రోగాల బారిన పడి గొర్రెలు మృతి చెందుతున్నాయి. మూతి రోగం బారిన పడిన గొర్రె గొంతు వాచి నాలుక చెడిపోయి మేత మేయక మృతి చెందుతున్నట్లు గొర్రెల కాపరులు చెబుతున్నారు. శ్రావణమాసం మొదలుకొని మగ, పుబ్బ, ఉత్తెర, చిత్త, స్వాతి కార్తెల్లో కురిసే వర్షాలకు గొర్రెలు కాళ్లు చెడిపోయి మూతులు వాచి గాలికుంటు వ్యాధికి గురై మృతి చెందుతున్నాయి. ఇప్పటికే ప్రతి రోజు బొంరాస్‌పేట్‌లో యూనిట్‌కు ఒకటి చొప్పున మృతి చెందుతున్నాయి. గత వారం రోజులుగా బొంరాస్‌పేట్‌లోనే 20 నుంచి 35 గొర్రెలు మృతి చెందినట్లు సమాచారం...

మందులు లేవు...

జంతువులకు వచ్చే రోగాలను కాపాడేందుకు బొంరాస్‌పేట్‌లో పశువైద్య శాల వైద్యులు ఉన్నా మందులు మాత్రం కరువయ్యాయి. నట్టల నివారణ కోసం వేసిన మందులు తప్ప ఆసుపత్రిలో ఎలాంటి మందులు లేవని కురుమ గొల్ల యాదవులు చెబుతున్నారు. ప్రభుత్వం అందించిన గొర్రెలతో పాటు తమ



బొంరాస్‌పేట్ పశువైద్య శాల

గొర్రెలను కాపాడుకునేందుకు కురుమ గొల్ల యాదవులు ప్రైవేట్‌లో మందులను కొనుగోలు చేస్తున్నారు. విచిత్రమైన మూతి రోగం నివారణ కోసం రూ.700 వెచ్చించి 250 మిల్లీ లీటర్ల మందును కొనుగోలు చేస్తున్నారు. పావులీటర్ మందు రెండు రోజుల పాటు పది గొర్రెలకు మాత్రమే పని చేస్తుంది. ఒక్కో యూనిట్ గొర్రెలను కాపాడుకోవాలంటే పదిహేను రోజులకోసారి రూ.1,000 నుంచి రూ.2వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు గొర్రెలను కాపాడుకునేందుకు సీజనల్‌గా వచ్చే వ్యాధులను గుర్తించి మందులను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.



కొడంగల్‌లో ధర్నా చేస్తున్న సాక్షరభారత్ కో ఆర్డినేటర్లు

సాక్షరభారత్ కో ఆర్డినేటర్ల ఆధ్వర్యంలో ధర్నా

కొడంగల్: సాక్షరభారత్ కో ఆర్డినేటర్‌ల సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని మండల కో ఆర్డినేటర్ కృష్ణంరాజు అన్నారు. సాక్షరభారత్ ఉద్యోగుల సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయి కో ఆర్డినేటర్‌కు రూ.6 వేలకు బదులు ఏపీయం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లకు అందిస్తున్న వేతనం మాదిరిగా రూ.30వేలు చెల్లించాలన్నారు. గ్రామీణ కో ఆర్డినేటర్‌లకు రూ.2వేలకు బదులు ఫీల్డ్ అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీ టీచర్‌ల మాదిరిగా రూ.10వేలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల వేతనాలను అందిస్తూ పెండింగ్‌లో ఉన్న వేతనాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తూ పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ వెంకటేశ్‌కు అందించారు. ధర్నాలో కో ఆర్డినేటర్‌లు పకీరప్ప, వెంకటయ్య, శేఖర్, ఫరీదాబేగం, శాంత, భీమప్ప, చిన్నయ్య, రుక్మిణి, సావిత్రి, బాలప్ప, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్‌లో

బొంరాస్‌పేట్: సాక్షరభారత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కో ఆర్డినేటర్‌లు సమ్మెకు దిగారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మండల కో ఆర్డినేటర్ హన్మంతు ఆధ్వర్యంలో బైఠాయించి నిరసన తెలిపారు. నిరసనకు సీఐటీయూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి నాయకులు మద్దతు తెలిపారు.

దౌల్తాబాద్‌లో...

దౌల్తాబాద్: గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని సాక్షరభారత్ మండల కో ఆర్డినేటర్ వెంకటేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు గ్రామ కో ఆర్డినేటర్‌లతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కో ఆర్డినేటర్‌లకు ఉద్యోగ భద్రత, హెల్త్‌కార్డులను అందించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో అరుణ, భాగ్యలక్ష్మీ, పకీరప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

'హరితహారంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి'

కొడంగల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై పరిరక్షణకు కృషి చేయాలని సర్పంచ్ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో ఉపాధిహామీ కూలీలకు ఇంటి ఆవరణల్లో నాటేందుకు మొక్కలను అందించారు. ఉపాధి కూలీలు ప్రతి ఒక్కరు తమ ఇళ్ల ముందు, పొలం గట్లపై మొక్కలను నాటుతూ వాటిని సంరక్షించాలన్నారు. వర్షాభావ పరిస్థితులు అనుకూలించకపోవడంతో నాటిన మొక్కలు వేసవిలో ఎండిపోయే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఈఓ పద్మ, ఫీల్డ్ అసిస్టెంట్ బాలప్ప, వార్డు సభ్యులు, మహిళా సంఘం సభ్యులు ఆనందమ్మ పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

'పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి'

కొడంగల్: పాత పెన్షన్ విధానం అమలు చేసేంత వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎంఈఓ వెంకట్రామ్‌రెడ్డి, క్రాంతికుమార్, పాండురంగం, వెంకటయ్య, సాయప్ప తదితరులు అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో, బాలికల పాఠశాలలో సెప్టెంబర్ 1 సామూహిక సెలవు పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న ఉపాధ్యాయ, ఉద్యోగులు సామూహిక సెలవుతో జిల్లా కేంద్రంలో జరిగే ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా టీఎస్‌సీపీఎస్‌ఈఏ, పీఆర్టీయూ సంఘాల నాయకులు రాజు, శ్రీను, వెంకటప్ప, సాయప్ప పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

బొంరాస్‌పేట్: సర్వశిక్షాభియాన్ ద్వారా కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ద్వారా సేవలు అందిస్తున్న ఉద్యోగుల డిమాండ్‌లను పరిష్కరించాలంటూ తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినందన్ రావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బావుసింగ్ మాట్లాడుతూ సర్వశిక్షాభియాన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను మంజూర్ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాధిక, శ్రీకాంత్, నర్సిములుయాదవ్, వేణుగోపాల్, శ్రీలత, అనంతరాములు, రాణెమ్మ, రామక్రిష్ణ, వెంకటయ్య, ఎండీ.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణ కోసం మట్టివిగ్రహాలు'

కొడంగల్: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులను ప్రతిష్టించి పూజించడం శ్రేయస్కరమని కేటీఆర్ రాష్ట్ర యువసేన నాయకులు మోహన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో జడ్పీ మాజీ వైస్ చైర్మెన్ కృష్ణకు మట్టి వినాయకుడిని అందించారు. అనంతరం స్థానిక టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, పార్టీ అధ్యక్షుడు జీ.రాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బస్వరాజ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులకు మట్టి వినాయకులను అందించారు.



మట్టివిగ్రహాలను అందజేస్తున్న నాయకులు

కొడంగల్‌రూరల్: 5 రోజుల పాటు నిత్య పూజలందుకున్న గణనాథుడు నిమజ్జనానికి శ్రీశైలానికి తరలి వెళ్లాడు. మంగళవారం మండల పరిధిలోని చిట్లపల్లి గ్రామంలో వినాయక చవితిని పురస్కరించుకొని ప్రతిష్ఠించిన వినాయకుడు 5 రోజుల పాటు భక్తుల పూజలందుకొని ఆటాపాటలతో యువకులు నిమజ్జనానికి తరలి వెళ్లాడు. వాహనంపై వినాయకుడిని ఉంచి గ్రామం నుంచి భజనలతో కొడంగల్ మీదుగా శ్రీశైలానికి తరలించారు. కార్యక్రమంలో ఎల్లమ్మ సంఘం సభ్యులు రామప్ప, వెంకటప్ప, నర్సప్ప, అబ్దులప్ప, యాదయ్య, మహేశ్, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

అడవి పందుల దాడిలో పంట నష్టం



అటవీ శాఖ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

బొంరాస్‌పేట్: అడవి పందుల స్వైర విహారంతో రైతులు సాగు చేసిన పంటలు నష్టానికి గురవుతున్నాయి. పందుల దాడికి మెట్లకుంట, దుద్యాల, బొంరాస్‌పేట్ గ్రామాల్లో పంటలు ధ్వంసమయ్యాయి. సోమవారం రాత్రి మెట్లకుంట గ్రామానికి చెందిన అనంతయ్య, రాములు, లక్ష్మయ్య, అంజిలయ్యలకు చెందిన మొక్కజొన్న పంటలు ధ్వంసమయ్యాయి. దుద్యాల, బొంరాస్‌పేట్‌లలో కంది పంటలు సైతం నష్టపోయినట్లు రైతులు వాపోతున్నారు. పందుల బారి నుంచి నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని కొడంగల్‌లో అటవీ శాఖ అధికారులకు వినతి పత్రం అందించారు. పందుల దాడికి శ్వాశత పరిష్కారం చూయించాలని రైతులు కోరుతున్నారు.

‘చిన్నారులకు రుబెల్లా టీకాను వేయించాలి’

బంట్వారం : చిన్నారులకు రుబెల్లా టీకాలను వేయించాలని జిల్లా మానిటరింగ్ అధికారి టి.రమేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తొర్మామిడి ఉర్దు మీడియం పాఠశాలలో విద్యార్థులకు రుబెల్లా టీకాలను వేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ, ప్రభుత్వం రుబెల్లా టీకాల కార్యక్రమాన్ని ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 25 వరకు నిర్వహిస్తుందని, 9నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలందరికి తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. మండల వైద్యాధికారి మునిందర్‌కుమార్, సీహెచ్‌వో నర్సింగ్‌రావు, ఎస్ఎంసీ చైర్మన్ మున్నాబాయి, ఉపాధ్యాయులు అసదుల్లా, మహేందర్ పాల్గొన్నారు.

‘లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి’



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణకుమారి

బంట్వారం : లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని ఎంపీడీవో కృష్ణకుమారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ, ఒక్కో నోడల్ అధికారికి ఇచ్చిన లక్ష్యం మేరకు హరితహారం మొ క్కలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు కేవలం 30శాతం మాత్రమే మండలంలో పూర్తయ్యిందని మిగతావి త్వరలో పూర్తి చేయాలన్నారు. కొన్నిరోజులుగా వర్షాలు లేక పోవడంతో మొక్కలు నాటలేక పోయామని, ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున హరితహారంపైన దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ లక్ష్మినారాయణ, ఏపీవో నరోత్తంరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టేంట్లు పాల్గొన్నారు.

‘విద్యార్థులకు అనుగుణంగా బస్సులు నడపాలి’

వికారాబాద్ రూరల్ : విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.యాదగిరి అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక బీజేఆర్ చౌరస్తాలో రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతి పల్లెకు బస్సు అంటున్నారే తప్ప అది ఆచరణలో మాత్రం అమలు కావడం లేదన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని స్కూళ్లు, కాలేజీల్లో చదువుకోడానికి బార్వాద్, మోత్కుపల్లి, నాసన్‌పల్లి తండా, మదన్‌పల్లి, అత్తెల్లి, కొంపల్లి తదితర గ్రామాల నుంచి 200మంది విద్యార్థుల వరకు బస్సులో ప్రయాణం చేస్తున్నారన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారి సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, గాయాస్, నరేష్, ముస్తాఖాన్ పాల్గొన్నారు.

‘మెయిన్‌రోడ్డుపై డివైడర్లను ఏర్పాటు చేయాలి’

వికారాబాద్ రూరల్ : వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్నెపల్లి నుంచి అనంతగిరి గుట్ట, ఎన్‌టీఆర్ చౌరస్తా నుంచి కొత్తగడి వరకు, బీజేఆర్ నుంచి అనంతరిగిపల్లి వరకు, బస్‌స్టేషన్ నుంచి రైల్వే స్టేషన్ మీదుగా ఆలంపల్లి వరకు డివైడర్లను ఏర్పాటు చేయాలని కేవీపీఎస్ జిల్లా కమిటి జిల్లా అధ్యక్షుడు యు.మల్కయ్య జిల్లా కలెక్టర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం నాయీబ్రాహ్మణ కమిటీ ఎన్నిక

బంట్వారం : మండల కేంద్రంలో మంగళవారం నాయిబ్రహ్మణ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల శాఖ అధ్యక్షుడు శివరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బంట్వారం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడుగా వీరేశం, ప్రధాన కార్యదర్శిగా శ్రీను, కోశాధికారిగా బాలయ్య, గౌరవాధ్యక్షుడిగా రాములులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

‘ఒగ్గు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి’

వికారాబాద్ రూరల్: ఒగ్గు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు నాగులపల్లి నరసింహం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మల్లికార్జునస్వామి దేవాలయం ఆవరణలో ఒగ్గు కళాకారుల జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒగ్గు కళాకారుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ప్రభుత్వం తరపున శిక్షణ ఇవ్వాలని, కళాకారులకు జీవనోపాధిని కల్పించి ఆదుకోవాలని ఆయన కోరారు. కళాకారుల పిల్లల చదువుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఒగ్గు కళాకారులు ప్రభుత్వం నుంచి గుర్తింపు కార్డులు పొందడానికి సెప్టెంబర్ 13లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు, గ్రామాల కళాకారులు అనంతయ్య, శ్రీశైలం, కిష్టయ్య, శివయ్య, మల్లేషం, సాయన్న, శ్రీరాములు, శ్రీనివాస్, బీరయ్య, శంకర్, మల్లయ్య, రాములు పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జనోత్సవం

● పలుచోట్ల వినాయకుల నిమజ్జనం

వికారాబాద్ అర్బన్ : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజలందుకున్న బొజ్జగణపయ్యకు పట్టణంలోని ఆయా కళాశాలు, పాఠశాలలో పాటు పలు వార్డుల్లో, మండలంలోని ఆయా గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని సరస్వతీ జూనియర్ కళాశాల, సిద్దార్థ స్కూల్ విద్యార్థులు వారు ఐదు రోజుల పాటు పూజించిన గణపయ్యను గంగాదేవి వడికి చేర్చారు. అదే విధంగా రైల్వే క్వార్టర్స్ గణనాథుడు, రామయ్యగూడ, కొత్తగడిలోని వినాయకులను ఎబ్బనూర్ చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బస్వరాజ్, సిద్దార్థ స్కూల్ ప్రిన్సిపల్, ఆయా వార్డుల పెద్దలు, మండపాల నిర్వహకులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న సరస్వతీ కళాశాల విద్యార్థులు

ధారూర్‌లో..

ధారూరు : ధారూరు మండల కేంద్రంలో మంగళవారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామంలో వివిధ కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఉత్సవ కమిటీ నిర్వాహకులు మంగళవారం ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం వినాయక విగ్రహాలను వాహనాల్లో పెట్టి నిమజ్జన ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో హిందు ఉత్సవ కమిటీ నిర్వాహకులు శివానందం, నెల్లి విశ్వనాథం, అమరేశ్వర్‌రావు, బుజ్జయ్యగౌడ్, యాత్రాగౌడ్, చంద్రమౌళి, ఎం.రమేష్, సుధాకర్‌గౌడ్, మల్లేషంగౌడ్ పాల్గొన్నారు.



వెల్‌చాల్‌లో నృత్యాలు చేస్తున్న భక్తులు

బంట్వారం, కోట్‌పల్లిలో..

బంట్వారం/కోట్‌పల్లి: కోట్‌పల్లి, బంట్వారం మండల కేంద్రాలతో పాటు తొర్మామిడి, బొపునారం, సుల్తాన్‌పూర్, సల్బత్తాపూర్, యాచారం, మాలసోమారం, కోట్‌పల్లి, కొత్తపల్లి, ఎన్కెపల్లి, ఎన్నారం, నాగసాన్‌పల్లి, మోత్కుపల్లి, బార్వాద్ తదితర గ్రామాల్లో గత ఐదు రోజులుగా పూజలు అందుకున్న వినాయకులను మంగళవారం నిమజ్జనం చేశారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: మండల పరిధిలోని వెల్‌చాల్ గ్రామంలో అయిదు రోజులుగా పూజలందుకున్న గణనాథులను మంగళవారం భక్తి శ్రద్ధల మధ్య పలువు రు భక్తులు నిమజ్జనం చేశారు. గణనాథుల వద్ద ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుసుధన్‌రెడ్డి, విఠల్, ప్రతాప్‌రెడ్డి, దామోదర్, పెంటయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ధారూర్‌లో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు

వికారాబాద్ మండలంలో..

వికారాబాద్ రూరల్ : వినాయక చవితిని పురస్కరించుకుని స్థానిక వైష్ణవి పాఠశాలలో ఏర్పాటు చేసిన గణనాథుడిని మంగళవారం నిమజ్జనం చేశారు. మెయిన్ రోడ్డు మీదుగా కొనసాగిన వినాయకుడి శోభాయాత్రలో దారి పొడవునా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆట పాటలతో అందరినీ అలరించారు. అనంతరం వినాయకుడిని ఎబ్బనూరు చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ యాస్కి సునీల్, కరస్పాండెంట్ కల్కోడ నర్సిములు, ప్రిన్సిపాల్ ఇబ్రహీం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిమజ్జనోత్సవంలో వైష్ణవి పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు

శ్రీకాంత్ ఆత్మహత్యకు కారణమైన ఈఈనీ సస్పెండ్ చేయాలి

● పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సంస్థ జిల్లా అధ్యక్షుడు అంజయ్య

వికారాబాద్ అర్బన్ : నిర్మల్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఏఈఈ శ్రీకాంత్‌ఆత్మహత్యకు కారణమైన ఈఈ రఘువీరారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సంస్థ జిల్లా అధ్యక్షుడు అంజయ్య పేర్కొన్నారు. మంగళవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం ముందు శ్రీకాంత్ ఆత్మహత్యకు నిరసనగా దర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకుని వారం రోజులు గడుస్తున్న ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత ఈఈ రఘువీరారెడ్డి ఒత్తిడి కారణంగా శ్రీకాంత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అందుకు సంబంధించి మూడు పేజీల సూసైట్ నోట్ రాయడం జరిగిందన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే ఖచ్చితంగా అధికారి చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారూ ఎట్టి పరిస్థితుల్లో ఆధైర్యపడోద్దన్నారు. ఈపని కాకుంటే ఇంకో పని చేసుకోని బ్రతుకోచ్చని, లేదా ఏదైన సమస్య ఉంటే యూనియన్ నాయకులకు కాని, ఉన్నతాధికారుల దృష్టికి కాని సమస్యలను తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డిప్యూటీ ఈఈ గోపినాథ్, రాజ్‌కుమార్, ఉమేష్, ఏఈలు లక్ష్మణ్‌రావు, లక్ష్మయ్య, బాలచందర్, రాజులున్నారు.



ధర్నా చేస్తున్న పీఆర్ ఇంజనీరింగ్ సంఘం నాయకులు

వికారాబాద్‌లో వర్షం

● హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్‌లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అడపదడప వర్షం కురిసింది. గంట వర్షం కురిస్తే గంట ఎండ కొడుతూ ఆటలాడింది. పట్టణంలో కురిసన వర్షంతో ప్రయాణికులు ఒక్కింత ఇబ్బందులు గురయ్యారు. ఇదిలా ఉంటే వికారాబాద్ మండలంలో కురిసిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసిన భూగర్భ జలాలు పెరిగా బావులు,బోర్లలో నీరురావాలని దేవుడ్ని వేడుకుంటున్నారు. వర్షాలు కురిస్తే రబీకైనా నీరు అందుబాటులో ఉంటాయని రైతులు భావిస్తున్నారు. చూడాలని వాన దేవుడు రైతులపై నీళ్ల చల్లుతాడో వర్షానికి పొలాలపై చల్లుతాడని రైతులు అనుకుంటున్నారు.

శ్మశాన వాటిక స్థల సమస్య పరిష్కారం

ధారూరు : ధారూరు మండలం కెరెళ్లి గ్రామంలో 20 సంవత్సరాలుగా పరిష్కారం కాని శ్మశాన వాటిక స్థలం సమస్య మంగళవారం వికారాబాద్ ఆర్డీవో విశ్వనాథం పరిష్కరించారు. జిల్లా కలెక్టర్ దివ్య ఆదేశాలతో వికారాబాద్ ఆర్డీవో విశ్వనాథం, ధారూరు తహసీల్దార్ గాయత్రితో కలిసి కెరెళ్లి గ్రామ శివారులోని సర్వే నెం.17లో ఉన్న ఒక ఎకరా ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ భూమిని ప్రభుత్వం స్మశాన వాటికకు కేటాయించి ప్రహారీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. కాగా ఈ స్థలంలో తమకు ఇళ్ల నిర్మాణం కోసం గతంలో అధికారుల ప్లాట్లు కేటాయించారని కొంతమంది గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ స్మశాన వాటిక స్థల వివాదం కొనసాగుతూ వస్తుంది. ఈ సమస్యను ఆర్డీవో విశ్వనాథం మంగళవారం గ్రామానికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడి స్మశాన వాటికకు కేటాయించి ఒక ఎకరా స్థలంలో మార్క్ కొట్టించి జేసీబీ ద్వారా పనులను చేయించారు. ఈ స్థలం చుట్టూ హద్దులను నిర్ణయించి సమస్యను పరిష్కరించారు. ఆర్డీవో వెంట ఆర్ఐ యాదయ్య, సర్వేయర్ భాగ్యవతి, ఈవోపీఆర్డి మున్నయ్య, సర్పంచ్ శిరీషారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్థులు ఉన్నారు.



కెరెళ్లిలో శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

ఘనంగా గణనాథుల నిమజ్జనం

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్) జిల్లాలో వివిధ ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమం భారీ పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసింది.. అయిదు రోజులుగా భక్తుల పూజలందుకున్న గణనాథులు మంగళవారం గంగమ్మ తల్లి ఒడికి చేరారు. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ఆయా పట్టణాలు, గ్రామాల్లో ప్రతిష్టించిన 750 వరకు వినాయక విగ్రహాలను సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. తాండూరులో వినాయక నిమజ్జనం కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. మంటపాల నుంచి ఊరేగింపుగా బయలుదేరిన గణనాథులకు దారి పొడవునా భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు గణనాథుని ఎదుట ప్రదర్శించిన కోలాటాలు, నృత్యాలు, భక్తి పరవశంతో పాడిన పాటలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. తాండూరులో నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. వినాయక విగ్రహాలతో కొనసాగిన శోభాయాత్ర కోకట్ కాగ్నా నది వరకు కొనసాగింది. కాగ్నా నదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తాండూరులో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా పోలీసు యంత్రాంగమంతా అక్కడే తిష్టవేసింది. జిల్లా ఎస్పీ అన్నపూర్ణ స్వయంగా రంగంలోకి దిగి నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగం అడుగడుగునా నిఘా ఉంచింది. పోలీసు నిఘా సిబ్బంది నిమజ్జన కార్యక్రమాన్ని చిత్రీకరించారు. ముందస్తు జాగ్రత్త చర్యగా అనుమానితులపై నిఘా వేసి ఉంచారు. పోలీసు యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించడంతో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. ఇదిలా ఉంటే, వికారాబాద్, కొడంగల్, పరిగి ప్రాంతాల్లో కూడా వినాయక నిమజ్జనం చేశారు. ధారూరు మండల కేంద్రంలో వినాయకులను ఊరేగింపుగా తీసుకు వెళ్లి సమీప చెరువులో నిమజ్జనం చేశారు.

అంగన్‌వాడీలకు ప్రభుత్వం అండ

జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు భూమొల్ల కృష్ణయ్య



కార్యకర్తలతో మాట్లాడుతున్న కృష్ణయ్య

మోమిన్‌పేట : అంగన్‌వాడీ ఉద్యోగులకు టీఆర్‌ఎస్ ప్రభుత్వం కొండంత అండగా ఉందని టీఆర్‌ఎస్ జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు భూమొల్ల కృష్ణయ్య అన్నారు. మంగళవారం మోమిన్‌పేట మండలం వెల్‌చాల్ గ్రామంలో అంగన్‌వాడి ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడి ఉద్యోగులకు సీఎం కేసీఆర్ అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రస్థాయిలో 300 అంగన్‌వాడీ భవనాలను నిర్మించి ఖాళీలను త్వరలో భర్తీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులకు సమస్యగా భావిస్తున్న రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను ఎక్కడ లేని విధంగా రూ.60వేలు ప్రకటించిందని, దీనిని రెండు లక్షలకు తగ్గకుండా పెరిగే విధంగా టీఆర్‌ఎస్‌కేవి కృషి చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్‌కేవీ జిల్లా ఉపాధ్యక్షుడు అనంతయ్య, అంగన్‌వాడి టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.అరుణ, నాయకురాలు వి.బాలేశ్వరి, అమృతమ్మ, సుల్తానబేగం, మంగమ్మ, తరాబాయి, భారతి పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విఠల్

ధారూరు : కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని జిల్లా టీయూటీఎఫ్ అధ్యక్షుడు ఊరేళ్ల విఠల్ డిమాండ్ చేశారు. మంగళవారం ధారూరు మండలంలోని కెరెళ్లి,ఎబ్బనూరు, అల్లీపూర్, కుక్కింద, కొండాపూర్‌కలాన్, ధర్మాపూర్, నాగసమందర్, మున్నూరుసోమారం గ్రామాలలోని పాఠశాలల్లో టీయూటీఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సెప్టెంబర్ 1న సామూహిక సెలవుకు టీయూటీఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఆయన తెలిపారు. ఏకీకృత సర్వీస్‌రూల్స్‌కు సంబంధించి ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, కార్యదర్శులు శ్రీనివాస్,వెంకటయ్య, మండల శాఖ అధ్యక్షుడు భాస్కర్, గౌరవాధ్యక్షుడు విష్ణు, కోశాధికారి నర్సిములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీవోఎస్‌ల ఏర్పాటుకు 31 గడువు

రాయితీ, బదిలీ(డీబీటీ) విధానాన్ని అమలు చేసేందుకు వీలుగా ఈ నెల 31లోపు ఆన్‌లైన్ విధానంలోకి తీసుకురావాలని కేంద్ర ఎరువుల శాఖ తాజాగా ఆదేశాలను జారీ చేసింది. ఈ ఏడాది జూన్ నుంచి ఆన్‌లైన్ విధానాన్ని అమలులోకి తీసుకురావాలని ఆదేశాలు జారీ చేసినా యంత్రాలు అందలేదనే సాకుతో గతంలో మాదిరిగానే అమ్మకాలను కొనసాగిస్తున్నారు. కేంద్రం తిరిగి తాజాగా ఈ నెల 31లోపు యంత్రాలను పంపిణీ చేసి ఎరువుల అమ్మకాలను ఆన్‌లైన్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించడంతో తిరిగి అధికారులు పీఓఎస్‌ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నారు.



కొడంగల్: జిల్లాలో 1 లక్ష 41వేలకు పైగా హెక్టార్లలో పంటల సాగు చేస్తున్నారు. ఈ మేరకు ఏడాదికి దాదాపు 1 లక్ష మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ ప్రకారం జిల్లా నుంచి 1 కోటికిపైగా రాయితీ ఎరువుల కంపెనీలకు చెల్లిస్తారని అంచనా. ఎరువుల ప్రక్రియకు సంబంధించిన లెక్కలకు ఆయా కంపెనీలపైనే ఆధారపడాల్సి వచ్చేది. ఈ విధానంతో అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు కేంద్రం గుర్తించి అడ్డుకట్ట వేసేందుకు తాజాగా ఫర్టిలైజర్ మానిటరింగ్ విధానాన్ని అమలు చేసి వ్యాపారులు, రైతుల ఆధార్ నెంబర్లు, ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. గతేడాది దేశంలోని 16 జిల్లాలో ప్రయోగాత్మకంగా ఆధార్ ఆధారిత ఎరువుల పంపిణీకి ఈ విధానం సత్ఫలితాలివ్వడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచి అన్ని జిల్లాలో అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఫర్టిలైజర్ మానిటరింగ్ సిస్టం ద్వారా ఎరువులు అమ్మే వ్యాపారులు తమ వివరాలతో పాటు ఎరువుల కొనుగోలు చేసే రైతుల ఆధార్ వివరాలు, కొనుగోలు చేసే మొత్తం తదితర వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో ఏర్పాటు చేసిన సెంట్రల్ సర్వర్‌కు సమాచారం వెళ్లిపోయి ఆన్‌లైన్‌లో అందరికీ కనిపిస్తుంది. ఆన్‌లైన్‌లో నమోదైన ఎరువులకే రాయితీని కంపెనీలకు కేంద్రం విడుదల చేస్తుంది. ఎరువుల డీలర్లు దిగుమతి చేసుకున్న నిల్వలు, అమ్మిన సమాచారం ఏ రోజుకారోజు తెలిసిపోతుంది. మొదట్లో వంటగ్యాస్ మాదిరిగా రాయితీని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం భావించింది. ఈ విధానం విజయవంతమైతే అందరికీ వర్తింప చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

రాయితీ పక్కదారి పట్టకుండా...

ఈ- పాస్ విధానంతో రాయితీ పక్కదారి పట్టకుండా ఉండాలంటే ఇది తప్పనిసరి అని భావిస్తున్నారు. గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేయడంతో సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్రంలోని మిగతా జిల్లాలో అమలు చేయాలని నిర్ణయించింది. ఇంతకు ముందు ఎరువుల విక్రయాలకు సంబంధించి ఆయా కంపెనీలపై ఆధారపడాల్సి వచ్చేది. ఈ విధానంలో అనేక మార్పులు జరిగి కోట్లాది రూపాయల రాయితీ పక్కదారి పడుతున్నట్లు గుర్తించింది. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం రైతుల ఆధార్, కిసాన్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాన్ని అనుసంధానం చేసింది. దీంతో రైతులకు ఎంత భూమి ఉందో...ఎంత అవసరమో పక్కాగా తెలుస్తుంది. ఈ విధానం అమలులో ఏ రైతు ఎంత మేర ఎరువులను కొనుగోలు చేశాడోననేది తెలుస్తుంది. ఈ-పాస్ విధానంతో కేంద్ర సర్వీస్‌లకు సమాచారం వెళ్లిపోతుంది. ఒక వేళ రైతులు ఎరువులను కొనుగోలు చేస్తే అప్పుడే తెలిసిపోయి రాయితీ ఎరువుల కంపెనీలకు చేరుతుంది. దీంతో వారు అమ్మకం, ఇతర పన్నులను ఎగొట్టే అవకాశం ఉండదు. అంతేకాకుండా రైతుల భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను అందిస్తారు.

నెల ఆఖరిలోపు ఏర్పాటు చేసుకోవాలి



ఫర్టిలైజర్స్ దుకాణాదారులు ఈ నెల ఆఖరిలోపు ఈ-పాస్ యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలి. ఇప్పటికే కొంత మంది ఎరువుల దుకాణాదారులకు ఈ-పాస్ యంత్రాలను అందించడం జరిగింది. మిగతా వారికి త్వరలోనే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ విధానం అమలుతో రాయితీ ఎరువులు పక్కదారి పట్టకుండా నేరుగా రైతులకు అందేందుకు అవకాశం ఉంటుంది.

- వినయ్‌కుమార్, ఏడీఏ, కొడంగల్

రూర్బన్ పనులు వేగంగా పూర్తి చేయాలి

- నవంబర్‌లో పంట చేతికి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ దివ్యదేవరాజన్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

వికారాబాద్ అర్బన్ : రూర్బన్ పథకం కింద చేపట్టే పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో రూర్బన్ పథకం అమలుతీరుపైన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో చేపట్టే పనులను వేగవంతం చేయాలని సూచించారు. రూర్బన్ పథకం కింద చేపట్టిన ఆసుపత్రి నిర్మాణం, పునరుద్దరణ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకం కింద చేపట్టిన వ్యక్తిగత మరుగుదొడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె స్వచ్ఛంద సంస్థలకు సూచించారు. అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలకు సంబంధించిన మరమ్మతులు, నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఆమె పంచాయతీరాజ్ ఈఈని ఆదేశించారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో సబ్ సెంటర్ల పనులు, సంబంధిత గ్రామాల్లో పాఠశాలల పునరుద్దరణ పనులను వెంటనే చేపట్టాలని ఆమె అన్నారు. గ్రామాల్లోని లింకు రోడ్లను కూడా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలని, ఈ పనుల్లో షెడ్యూల్ కులాల వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో జాన్సన్, డీసీఎస్‌వో పద్మజ, పంచాయతీరాజ్ ఈఈ మనోహర్‌రావు, మైన్స్ ఏడీ జాకబ్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సుబ్బారావు, డీఎంహెచ్‌వో జ్యోత్స్న పాల్గొన్నారు.

జిల్లాలో 46.583 హెక్టార్లలో పత్తిసాగు

వికారాబాద్ జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 46,583 హెక్టార్లలో రైతులు పత్తి పంట సాగు చేసినట్లు కలెక్టర్ దివ్య తెలిపారు. మంగళవారం ఆమె తన ఛాంబర్‌లో జిల్లాలో రైతులు సాగు చేసిన పత్తి పంటపై మార్కెటింగ్ శాఖ, కాటన్ మిల్లర్స్, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, పత్తి పంట నవంబర్ మొదటి వారం నుంచి రావచ్చని, ఈ ఏడాది 1.20 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి రావచ్చని ఆశిస్తున్నామని చెప్పారు. పత్తిని కొనుగోలు చేసేందుకు జిల్లాలో ఇప్పటికే వికారాబాద్, తాండూరు, పరిగిలలో మొత్తం అయిదు కాటన్ మిల్లులు పని చేస్తున్నాయని అన్నారు. అవసరమైతే మర్పల్లి, బషీరాబాద్, కొడంగల్, కోట్‌పల్లిలలో అదనపు కేంద్రాల ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. పత్తి కొనుగోలు చేసినప్పుడు గోదాంల వద్ద స్టోరేజ్, రవాణా తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ , వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో సంబంధిత అధికారులు పని చేయాలని ఆమె సూచించారు. క్వింటాలు పత్తి మద్దతు ధర ప్రస్తుతం రూ.4,320 ఉందని ఆమె చెప్పారు. తూకం యంత్రాల కొరత లేకుండా చూడాలని తెలిపారు. హరితహారంలో భాగంగా కాటన్ మిల్లులలో ఎక్కువ మొక్కలు నాటాలని ఆమె సూచించారు. సమీక్షలో మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి, వ్యవసాయ శాఖ ఏడీ భారతి, సీసీఐ ఇన్‌చార్జి అధికారి శరత్, కాటన్ మిల్లుల యాజమానులు పాల్గొన్నారు.

యుటిలైజేషన్

సర్టిఫికేట్లు అందజేయాలి

వికారాబాద్ రూరల్: మూడేళ్లకు సంబంధించిన బీసీ, ఈబీసీ విద్యార్థుల పోస్ట్‌మాట్రిక్ స్కాలర్‌షిప్, ఫీజ్ రీఎంబర్స్‌మెంట్ యుటిలైజేషన్ సర్టిఫికెట్లను జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పుష్పలత ఒక ప్రకటనలో తెలిపారు. 2014-15, 2015-16, 2016-17 విద్యా సంవత్సరాలకు సంబంధించిన యూసీలను www.epass.cgg.gov.in లో అప్‌లోడ్ చేసిన తరువాత వాటి హార్డ్ కాపీలను కళాశాల ప్రిన్సిపాల్ కవరింగ్ లెటర్‌తో కార్యాలయంలో అందించాలని ఆమె సూచించారు. యుటిలైజేషన్ సర్టిఫికేట్లు సమర్పించపోతే ఆయా కళాశాలలకు సంబంధించి 2016-17 విద్యా సంవత్సరం ఫ్రెష్ విద్యార్థుల ఎంటీఎఫ్, ఆర్‌టీఎఫ్ నిధులను నిలిపి వేయడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. అదే విధంగా వికారాబాద్ జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లు 2016-17 విద్యా సంవత్సరానికి సంబంధించిన పెండింగ్ హార్డ్ కాపీలను సెప్టెంబర్ 7వ తేదీలోగా అందించాలని ఆమె సూచించారు. విద్యార్థుల ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు పెండింగ్‌లో ఉన్నట్లయితే ఆధార్‌కార్డు ఆన్‌లైన్‌లో ఆప్‌లోడ్ చేసి పాస్ బుక్ జిరాక్స్ కాపీలను తమ కార్యాలయంలో అందజేయాలని ఆమె తెలిపారు.

ఎండకొడుతూ.. వాన కురుస్తూ..

మోమిన్‌పేట: గ్రామాలలో ఎండకొడుతూ వాన కురుస్తుండడం పలు గ్రామాల్లో చర్చగా మారింది. దశలవారిగా వర్షం కురియడం వెంటనే ఎండ రావడం ఇదేమి విచిత్రమని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



మొరంగపల్లిలో ఎండతో పాటు కురుస్తున్న వర్షం



యాలాల మండలం కోకట్ కాగ్నానదిలో వినాయక నిమజ్జనం చేస్తున్న భక్తులు



వికారాబాద్‌లో నిమజ్జనోత్సవంలో సిద్ధార్థ స్కూల్ వినాయకుడు



తాండూర్‌లో వినూత్నరీతిలో వినాయకుడి విగ్రహం

వెళ్లిరా గణపయ్య

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమం భారీ పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసింది. అయిదు రోజులుగా భక్తుల పూజలందుకున్న గణనాథులు మంగళవారం గంగమ్మ తల్లి ఒడికి చేరారు. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజక వర్గాల్లో ఆయా పట్టణాలు, గ్రామాల్లో ప్రతిష్టించిన 750 వరకు వినాయక విగ్రహాలను సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి



పాత తాండూరు కోట నుంచి ప్రారంభమైన శోభయాత్ర



కొత్తగడిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



తాండూర్‌లో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులకు పూలు వేసి స్వాగతం పలుకుతున్న మంత్రి, ఎస్పీ అన్నపూర్ణ, నాయకులు



తాండూర్ భద్రేశ్వరచౌక్ వద్ద భక్తుల సందడి



తాండూర్‌లో మాదిరెడ్డి చౌక్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ విద్యార్థుల బ్యాండ్ బజనా



శ్రీశైలంలో నిమజ్జనానికి తరలి వెళ్తున్న చిట్లపల్లి గణనాథుడు



పరిగిలో గణేశ్ నిమజ్జనం కోసం ఊరేగింపులో భక్తులు



ధారూరులో నిమజ్జన ఊరేగింపులో మట్టి వినాయకుడు

మహిళల కోలాటం

తాండూరులో వినాయకుల శోభయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కోలాటం ఆడారు. మహిళల కోలాటం అందరినీ ఆకట్టుకుంది.

- తాండూరు



గణపయ్యకు వీడ్కోలు

శోభయామానంగా గణనాథుల శోభయాత్ర

పర్యవేక్షించిన ఎస్పీ అన్నపూర్ణ

ఆకట్టుకున్న గణనాథులు

నృత్యాలు, చెక్క భజనలతో కోలాహలం

తాండూరు/తాండూరు రూరల్ : ఐదు రోజులు పూజలందుకున్న గణపయ్యకు తాండూరు వాసులు ఘనంగా వీడ్కోలు పలికారు. మంగళవారం పాత తాండూరు నుంచి కోలాహలంగా వినాయక నిమజ్జన శోభయాత్ర ప్రారంభమైంది. అర్ధరాత్రి వరకు వినాయక నిమజ్జనోత్సవ వేడుకలు కొనసాగాయి. జైజై గణేషా....జై కొడతా గణేషా అంటూ ప్రత్యేక వాహనాల్లో అలంకరించిన సాంప్రదాయ బద్ధంగా కోకట్ కాగ్నానదిలో నిమజ్జనం చేశారు. భిన్నసంస్కృతులు సాంప్రదాయాలకు నిలయంగా ఉన్న తాండూరులో ఈసారి వినాయక నిమజ్జనోత్సవం శోభాయమానంగా సాగింది. మేళతాళాలు.. భాజాభజంత్రీలు.. డప్పుల చప్పుళ్లు.. భజన సంకీర్తనలు, చెక్క భజనలు, కోలాటాలు, యువకుల కేరింతలు.. కాషాయం జెండాల నడుమ అంగరంగ వైభవంగా వినాయకుల సామూహిక శోభయాత్ర కన్నుల పండువగా సాగింది. వివిధ ప్రాంతాలలో ప్రతిష్టించిన వినాయక విగ్రహాలను గంజ్ మట్టిచెట్టు కూడలి వద్దకు చేరుకుని అక్కడి నుంచి హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో భద్రేశ్వర చౌక్‌లో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకున్నాయి. అక్కడ హిందూ ఉత్సవ కేంద్ర సమితి రంగులు చల్లి, పువ్వులు వేసి గణనాథులకు స్వాగతం పలికారు.



గాజీపూర్‌లో నిమజ్జనానికి తరలుతున్న వినాయకులు



బషీరాబాద్‌లో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న రోహిత్‌రెడ్డి

అందరినీ చల్లగా చూడాలి

మంత్రి మహేందర్‌రెడ్డి

దేవుడు అందరినీ చల్లగా చూడాలని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. తాండూరు భద్రేశ్వరచౌక్‌లో హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని గణనాథులకు స్వాగతం పలికారు. రాష్ట్రం ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్విఘ్నంగా అభివృద్ధిలో ముందుకెళ్లాలని దేవుడిని కోరుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతాసంపత్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఎం.రమేష్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రోహిత్‌రెడ్డి, బషీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిత్, సిటీ కేబుల్ ఎండీ నర్సింహారెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ రాజుగౌడ్, టీఆర్ఎస్ నాయకులు కరణం పురుషోత్తంరావు, సిద్రాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, కౌన్సిలర్ పట్లో నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

స్వయంగా పర్యవేక్షించిన ఎస్పీ...

నిమజ్జనోత్సవాన్ని జిల్లా గ్రామీణ ఎస్పీ అన్నపూర్ణ స్వయంగా పర్యవేక్షించారు. తాండూరు పట్టణంతోపాటు నిమజ్జనం జరిగే కోకట్ కాగ్నానదిని ఎస్పీ పరిశీలించారు. ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు తాండూరు పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాలను డీఎస్పీ రాంచంద్రుడుతో కలిసి స్వయంగా పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు ఊరేగింపు వివరాలను తెలుసుకున్నారు. పాత తాండూరు కోట నుంచి మొదట గా శోభయాత్ర ప్రారంభం కాగా, అక్కడ ప్రాంతాన్ని సమస్యాత్మక ప్రాంతంగా పోలీసులు గుర్తించడంతో వికారాబాద్ డీఎస్పీ నర్సింహులు ఆధ్వర్యంలో సీఐలు వెంకటరామయ్య, సైదిరెడ్డిలు స్వయంగా పర్యవేక్షించారు.



తాండూరులో వినాయకుల శోభయాత్ర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అన్నపూర్ణ

వినాయకుని లడ్డూ రూ. 95 వేలు

తాండూరు : గతంలో కంటే ఈ ఏడాది వినాయక లడ్డూ కొనుగోలుకు భక్తులు పోటీ పడ్డారు. పలు ప్రాంతాల్లో వేలాది రూపాయలకు లడ్డూలను కొనుగోలు చేశారు. తాండూరు పట్టణంలోని కన్య పాఠశాల సమీపంలో సంతోష్‌కుమార్ రూ. 95 వేలకు వేలంలో లడ్డూ కొనుగోలు చేయగా, వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ తులసీ నగర్‌లో విశ్వవేద హైస్కూల్‌కు చెందిన వెంకటేష్ రూ. 84 వేలకు, పసారి వార్డులోని ఓంకార్ వినాయకోత్సవ సమితి వినాయకుని వద్ద కుంచం శివకుమార్ అండ్ బ్రదర్స్ రూ. 34 వేలకు లడ్డూను కొనుగోలు చేశారు. నాయిబ్రాహ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయకుని వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



రూ.84వేలకు లడ్డూను కొనుగోలు చేసిన వెంకటేష్

కాగ్నా నదిలో నిమజ్జనం......

యాలాల : తాండూరు పట్టణంలో ప్రతిష్టించిన వినాయకులను మంగళవారం యాలాల మండలం కోకట్ కాగ్నానదిలో నిమజ్జనం చేశారు. చిన్న వినాయకులతోపాటు భారీ వినాయకులనూ కాగ్నానదిలో నిమజ్జనం చేశారు. తాండూరు నుంచి చిలుక వాగు మీదుగా కోకట్ కాగ్నా నది వరకు తాండూరు మున్సిపల్ అధికారులు రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేశారు. అయితే ఈసారి అగ్నిమాపక, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయలేదు. ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



తాండూరు భద్రేశ్వరచౌక్‌లో వినాయకులకు స్వాగతం పలుకుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు

తాండూరు రూరల్‌లో...

తాండూరు రూరల్ : తాండూరు మండలంలో మంగళవారం వినాయక నిమజ్జనం కన్నుల పండువగా సాగింది. మండల పరిధిలోని గౌతాపూర్, మల్కాపూర్, కరన్‌కోట్, జినుగుర్తి, నారాయణపూర్, గోనూరు, సంగెం కలాన్, కోటబాస్పల్లి, మిట్టబాస్పల్లి, ఐనెల్లిలో వినాయక నిమజ్జనం నిర్వహించారు. ఊరేగింపుగా వినాయకులను తీసుకెళ్లి సమీపంలోని చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేశారు. పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

యాలాలలో...

యాలాల : మండలంలో వినాయక నిమజ్జనాన్ని ఘనంగా జరిపారు. డప్పు వాయిద్యాలు, బాజాభజంత్రీలు, భజనలు, నాట్యాలు, నృత్యాలతో వీధులన్నీ హోరెత్తాయి. యువకులు, చిన్నారుల నృత్యాలతో మండలమంతా కోలాహలంగా మారింది. గణేష్ మహరాజ్‌కీ జై అన్న నినాదంతో మండలంలోని గ్రామాలన్నీ మార్మోగాయి. కన్నుల పండవగా శోభయాత్రను నిర్వహించారు. మం డల పరిధిలోని రాస్నం, యాలాల, అగ్గనూరు, రాఘవాపూర్ తదితర గ్రామాల్లో గణేష్ నిమజ్జనోత్సవం వైభవం గా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందో బస్తు నిర్వహించారు.

బషీరాబాద్ మండలంలో...

బషీరాబాద్ : మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ప్రతిష్టించిన వినాయక విగ్రహాలను భజన సంకీర్తనలు, వాయిద్యాలు, మేళతాళాలతో యువకులు, భక్తులు శోభయాత్ర కొనసాగిస్తూ మంగళవారం నిమజ్జనం చేశారు. బషీరాబాద్‌లోని ఇందిరానగర్‌లో ప్రతిష్టించిన వినాయకుడివద్ద టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రోహిత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రోహిత్ మహరాజ్, నవాంధ్గీ పీఏసీఎస్ డైరెక్టర్ అజయ్‌ప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రావణ్, బన్సీలాల్, ప్రశాంత్ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజవర్దన్‌రెడ్డి, ఎంపీటీసీ నరేష్‌చౌహాన్, కాంగ్రెస్ జిల్లా ప్రచార కార్యదర్శి రాజరత్నం, పవన్‌ఠాగూర్, వార్డు సభ్యుడు రాము తదితరులు పాల్గొన్నారు. నిమజ్జనం సందర్భంగా ఎస్ఐ షర్ఫొద్దీన్ నేతృత్వంలో సిబ్బంది బందోబస్తును నిర్వహించారు.

పెద్దేముల్ మండలంలో...

పెద్దేముల్ : పెద్దేముల్ మండలంలో వినాయక నిమజ్జన కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. పెద్దేముల్ మండల పరిధిలోని ఆడ్కిచర్ల, రుక్మాపూర్, కొండాపూర్, మదనంతాపూర్, పాషాపూర్, గాజీపూర్, బండమీదిపల్లి, బుద్దారం, మంబాపూర్ తదితర గ్రామా ల్లో మంగళవారం వినాయక నిమజ్జనం నిర్వహించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వినాయకుల శోభయాత్ర కన్నుల పండువగా జరిగింది.

వినాయకుడికి చిన్నారుల పూజలు...

ఐదు రోజులుగా ఘనంగా పూజలందుకున్న వినాయకులు మంగళవారం నిమజ్జనానికి తరలివెళ్లారు. అంతకుముందు పెద్దేముల్ మండలం ఆత్కూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద చిన్నారులు పూజలు నిర్వహించారు.

బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట

కాంగ్రెస్ పార్టీ తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ రమేష్

యాలాల : బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని ఆ పార్టీ తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ ఎం.రమేష్ అన్నారు. మంగళవారం యాలాల మండల పరిధిలోని గిరిజాపూర్ గ్రామంలో రమేష్ సమక్షంలో 30 మంది టీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలే చేరారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ అండ్ కంపెనీగా మారిందన్నారు. కుటుంబ పాలనే రాష్ట్రాన్ని శాసిస్తుందని చెప్పారు. ఎన్నికల సమయంలో తెలంగాణను బంగారు తెలంగాణగా మారుస్తామని పేర్కొన్న టీఆర్ఎస్ నాయకులు ప్రస్తుతం వారి కోసం బంగళాలు కట్టుకున్నారని విమర్శించారు. ప్రజల్లో మహేందర్‌రెడ్డి పట్ల నమ్మకం పోయిందని, కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారని చెప్పారు. తాను ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాననీ, నేను నాన్ లోకల్ కాదు లోకల్ అని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపిస్తే తాండూరు నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి పరుస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ. 2 లక్షల రుణాలను ఒకేసారి మాఫీ చేస్తుందని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉత్తంచంద్, పెద్దేముల్ ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధారాసింగ్, నాయకులు రాంచంద్రారెడ్డి, అమృతయ్య, నర్సిరెడ్డి, కిష్టప్ప, సాయిలు, హజ్మతుల్లాతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాచి వడబోసిన నీటిని తాగాలి'

పెద్దేముల్ : ఆత్కూర్ తండాలో అధికారులు పర్యటించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు సూచించారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 70 మందికి వైద్యచికిత్సలు అందించారు. అందులో ముగ్గురికి జ్వరాలని వైద్యులు చెప్పారు. మిగతావారు కీళ్లనొప్పులతో బాధపడుతున్నారని తెలిపారు. వైద్య సిబ్బంది గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలు, మురుగుగుంటల్లో దోమల నివారణ పిచికారి చేయించారు. ట్యాంకు నీరు రావడం లేదనీ, బోరు నీటిని వాడుతున్నామని తండావాసులు తెలిపారు. అధికారులు బోరు నీటిని పరిక్షించారు. నీళ్లను కాచి వడబోసి తాగాలని వారికి వివరించారు. తండాలో పారిశుధ్య లోపం వల్ల రోగాల బారిన పడుతున్నారని వైద్యులు చెప్పారు. రోగాల బారిన పడకుండా ఉండేందుకు వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామప్రసన్న, ఈవోపీఆర్డీ సుదర్శన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్, ఏఈ భావన, వైద్యసిబ్బంది మల్లేశం, హెల్త్ అసిస్టెంట్లు రఘుపతి, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



రోగులు లేక వెలవెలబోతున్న ఆమనగల్లు హోమియోపతి వైద్యశాల

ముక్కుబడిగా.. వైద్యసేవలు

- కాంపౌండర్‌తో కొనసాగుతున్న ఆమనగల్లు హోమియో వైద్యశాల
- పట్టించుకోని అధికారులు



వైద్య సేవలందిస్తున్న కాంపౌండర్ బ్రహ్మానందం

ఆమనగల్లు: పట్టణంలోని హోమియో పతి వైద్యశాల ముక్కుబడిగా పనిచేస్తోంది. ఆసుపత్రి బాగోగులు ఎవరు పట్టించుకోవడం లేదు. సమస్యల సుస్తితో ఆసుపత్రి పరిస్థితి అధ్వాన్నంగా తయార య్యింది. నాలుగేళ్లుగా డాక్టర్ లేక ఆసుపత్రిపై రోగుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. క్రమంగా ప్రతి యేడు రోగుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఖాళీగా ఉన్న వైద్యుడి పోస్టు భర్తీ విషయంలో ఎవరు చొరవ తీసుకోవడం లేదు. ఆయుష్ అధికారులు కూడ ఆసుపత్రిని సందర్శించక సమస్యలు పట్టించుకోక ఆసుపత్రి ఉన్న ప్రయోజనం లేకుండా పోతోంది. గత మూడు దశాబ్దాల క్రితం ఆమనగల్లు పట్టణంలో హోమియోపతి వైద్యశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పట్లో ఆసుపత్రికి రోగుల తాకిడి అధికంగా ఉండేది. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలకు కలిపి ఒకే హోమియోపతి వైద్యశాల ఆమనగల్లులో ఉంది. అద్దె భవనంలో ఉన్న ఆసుపత్రిని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోకి మార్చారు. సొంత భవనం లేని ఆసుపత్రికి ఐదేళ్ల క్రితం రూ.10 లక్షలు వెచ్చించి భవనాన్ని నిర్మించారు. కాగా 2003 మే15న ఆసుపత్రిలో పనిచేసే డా.శంకరయ్యను జడ్చర్లకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నేటికి ఎవరిని నియమించలేదు. ఆసుపత్రికి కాంపౌండర్ బ్రహ్మానందమే ఆసుపత్రికి ప్రస్తుతం పెద్దదిక్కుగా మారాడు. హోమియేపతి వైద్యశాలలో ఒకే ఒక్క రెగ్యులర్ పోస్టు ఉంది. పార్ట్ టైమ్ స్వీపర్ మరొకరు కొనసాగుతున్నారు. డాక్టర్ పోస్టు ఖాళీగా ఉండడంతో కాంపౌండరే నాలుగేళ్లుగా వచ్చిన రోగులకు తన పరిధికి లోబడి సేవలందిస్తున్నాడు. డాక్టర్ లేని కారణంగా రోగుల సంఖ్య కూడ పూర్తిగా పడిపోయింది. ప్రస్తుతం రోజుకు 10, 12 మంది వస్తున్నట్లు రికార్డులు చూపుతున్నాయి. డాక్టర్ పోస్టు భర్తీ గురించి పలుమార్లు మండల సమావేశాల్లో కూడ ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యను ప్రస్తావించిన నేటికి స్పందన లేదు. డాక్టర్ పోస్టుల భర్తీ లేక ఆమనగల్లు ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టు భర్తీ చేయడం లేదని తెలిసింది. కొన్ని సందర్భాల్లో కాంపౌండర్ సెలవు పెడితే ఆసుపత్రి మూసేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టు భర్తీ చేసి వైద్య సేవలు మెరుగు పరచాలని స్థానికులు కోరుతున్నారు.

డాక్టర్ పోస్టు భర్తీ చేయాలి..

పత్యానాయక్, ఎంపీటీసీ, ఆమనగల్లు



నాలుగేళ్లుగా వైద్యుడి పోస్టు ఖాళీగా ఉంది. దీంతో దీర్ఘకాళిక రోగులు వైద్య సేవలందక ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీగా ఉన్న వైద్యుడు పోస్టు భర్తీ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న హోమియో పతి వైద్యశాల స్థాయిని కూడ పెంచి అందుకనుగుణంగా డాక్టర్లను, సిబ్బందిని నియమించాలి.

కారోబార్లకు గుర్తింపేదీ.?

- ఏళ్లుగా పనిచేస్తున్నా.. గుర్తించని ప్రభుత్వం
- చాలీచాలనీ జీతాలతో దుర్భర జీవితం గడుపుతున్న వైనం
- గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర...
- వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకోలు



కీసర: గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించేది కారోబార్లే.. గ్రామంలో ప్రభుత్వాదాయానికి గండిపడకుండా గ్రామంలో నిరంతరం పర్యవేక్షిస్తూ, గ్రామాభివృద్ధికి సైనికుల్లా పని చేసేవారు కారుబార్లు. ప్రభుత్వాలు ప్రజల కోరకు ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టిన మొదట ఉన్నత అధికారులు సంప్రదించాల్సింది అంటే అర్థం చేసుకోవచ్చు గ్రామపంచాయతీ కార్యాలయంలో వారి పాత్రేంటో. మనిషి పుట్టినా, చనిపోయినా విషయాన్ని ధృవికరించి పంచాయతీ కార్యదర్శికి తెలియజేసేది వారే. కాగా గ్రామాభివృద్ధికి వెట్టి చాకిరీ చేస్తున్న ప్రభుత్వాలు తమ కష్టాలను గుర్తించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలనీ వేతనాలతో దుర్భర జీవితాలు గడుపుతున్నా.. ప్రభుత్వాలు కనుకరించి వేతనాలు పెంచడం సరికాదు కదా.. ఉన్న జీతాలను కూడా సక్రమంగా ఇవ్వడం లేదని సిబ్బంది వాపోతున్నారు. కాగా జిల్లాల్లో 77 గ్రామ పంచాయతీలు ఉండగా, అందుల్లో 42 మంది పంచాయతీ కార్యదర్శులు మిగతా గ్రామాలకు ఇన్‌చార్జిలున్నారు. కాగా ఇంచార్జ్‌గా ఉన్న గ్రామాలల్లో మొత్తం గ్రామపంచాయతీ కార్యాలాపాలు, ప్రభుత్వ పథకాల అమలు ఇలా ప్రతి ఒక పనిని చేస్తూ పెనుభారంతో విధులు నిర్వహిస్తున్నారు. పని ఒత్తిడి వల్ల కొంతమంది కారోబార్లు ఆనారోగ్యాల భారిన పడుతుంటే, మరికొంత మంది ఉన్నత అధికారుల చేత మాటలు పడుతున్నారు. హరితహారంలో మూడో విడతలో భాగంగా జిల్లా ఉన్నతాధికారి కీసర మండలంలోని ఓ గ్రామంలో పర్యటించారు. పర్యటించిన సమయంతో ఆ గ్రామంలో హరితహారం పథకం ముందుకు పడకుండా సరైనా రీతిలో గుంతలు తీయకుండా, ఎరువు, కట్టెలు లేకపోవడం, గ్రామంలో పారిశుధ్యం లోపించడం వంటి పనులల్లో నిర్లక్ష్యం వహించడంతో ఉన్నత అధికారి పంచాయతీ అధికారిని నిలదీశాడు. దీంతో కార్యదర్శి నేను ఇన్‌చార్జి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నానని, పూర్తి బాధ్యత పంచాయతీ కారోబార్లదేనని అనడంతో ఆ ఉన్నతాధికారి సదరు కారోబార్‌పై నిప్పులు చెరిగాడు.దీంతో చేసేదేమీ లేక మండల, గ్రామస్థాయి అధికారులు ఆడిన ఆటలో బలిపశువయ్యాడు. ఇలా అనేక కార్యక్రమాలల్లో అధికారులు ఎలాంటి తప్పులు చేసిన చివరకు చివాట్లు పడేది మాత్రం బిల్ కలెక్టర్లేనని, అధికారులు మమల్ని బిల్‌కలెక్టర్లుగా కాకుండా కనీసం మనషులుగా కూడా చూడటం లేదని కారోబార్లు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల అమలుకు ఉదయం అరుగంటలకే విధుల్లో మునిగిపోవాల్సి వస్తుందని, కుటుంబ అలనపాలనకు దూరంగా ఉంటూ జైలు జీవితం గడుపుతున్నామని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి కారోబార్లను పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

రెగ్యులరైజ్ చేయాలి..

రమేష్, కారోబార్



గత 20 సంవత్సరాలుగా గ్రామపంచాయతీలో కారోబార్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. చాలీచాలనీ వేతనాలతో కుటుంబ పోషణ పెనుభారంగా మారింది. స్వరాష్ట్రంలోనైనా ప్రభుత్వం మమల్ని గుర్తించి ఉద్యోగాలను రెగ్యూలరైజ్ చేస్తారని ఎదురుచూస్తున్నాం.



రేపే.. ఆఖరు

- రేపటితో ముగియనున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ పథకం గడువు
- ఆన్‌లైన్‌లో సులభంగా దరఖాస్తు చేసుకునే అవకాశం
- ఎంపికైతే రూ.10లక్షలతో అత్యాధునిక ప్రయోగశాల ఏర్పాటు



వికారాబాద్ (ఫీచర్స్): ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక పరికరాలతో విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలల ఏర్పాటుకై కేంద్ర ప్రభుత్వం ప్రతిషష్ఠాత్మకంగా అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్) పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకానికి దరఖాస్తుల సమర్పణకు గడువు గురువారంతో ముగియనుంది. ఈ పథకం కింద ఎంపికయ్యే పాఠశాలల్లో రూ.10 లక్షల ఖర్చుతో అత్యాధునిక ప్రయోగశాలను ఏర్పాటు చేస్తారు. దరఖాస్తు చేసుకున్న పాఠశాలలను సంబంధిత అధికారులు 3 దశల్లో పరిశీలన నిర్వహించిన అనంతరం ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం..

ఈ పథకం కింద ప్రయోగశాలల ఏర్పాటుకు ఆసక్తి గల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ముందుగా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎన్ఐటీఐ.జీఓవి.ఇన్ వెబ్ సైట్‌ను ఓపెన్ చేయాలి. అందులో అటల్ టింకరింగ్ ల్యాబ్ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలతో పాటుగా పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుంది. కింది భాగంలో ఎరుపు రంగులో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ అని సూచిస్తూ అక్షరాలు ఉంటాయి. వాటి మీద క్లిక్ చేస్తే దరఖాస్తు ఫారం కనిపిస్తుంది. అందులో అడిగిన వివరాలను క్రమ పద్దతిలో నమోదు చేయాలి.

ఎంపిక విధానం..

ఆన్‌లైన్ అందిన దరఖాస్తులను సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు మొదటిదశలో పరిశీలన చేస్తారు. ప్రభుత్వం కోరినట్లుగా పూర్తి వివరాలు పొందుపరచి బడి ఉండి, పాఠశాలలో ల్యాబ్ ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలిస్తారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజులలోపు కేంద్రం ప్రత్యేకంగా నియమించిన పరిశీలనా బృందం పాఠశాలను సందర్శిస్తుంది. అనంతరం 20 రోజుల తర్వాత కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన నీతి అయోగ్ అధికారులు మరోమారు పాఠశాల స్థితిగతులను పరిశీలిస్తారు. ఇలా పలు దఫాలుగా జరిపిన పరిశీలన అనంతరం పాఠశాలల ఎంపికను పూర్తి చేస్తారు.

రూ.10లక్షలతో ప్రయోగశాల

కేంద్ర ప్రభుత్వం సూచించిన నిబంధనలన్నీ ఉన్న పాఠశాలను అటల్ టింకరింగ్ ల్యాబ్ పథకం కింద ఎంపిక చేస్తారు. ఆ పాఠశాలలో రూ.10 లక్షల ఖర్చుతో అత్యాధునిక ప్రయోగశాలను ఏర్పాటు చేస్తారు. 6-10 తరగతుల వరకు విజ్ఞాన శాస్త్ర అధ్యయనానికి అవసరమైన అన్ని వసతులను, పరికరాలను కల్పిస్తారు. సువిశాల ప్రయోగశాల ఏర్పాటుతో పాటు సంబంధిత ప్రయోగ సామాగ్రి, రసాయనాలు, ముడిసరుకులు అందుబాటులో ఉంచుతారు. దీంతో విద్యార్థులు ప్రయోగాత్మక పద్దతుల్లో విద్యను అభ్యసించడం ద్వారా శాస్త్రీయ సంగతులను, వాటిపై పట్టును పెంపొందించుకునే వీలు కలుగుతుంది.

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో..

జాగృతి కవితాంజలి కవి సమ్మేళనం

తాండూరు: తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈనెల 31న తాండూరులో జాగృతి కవితాంజలి కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు జాగృతి జిల్లా బాధ్యులు రామకృష్ణరాజు తెలిపారు. ఆగస్టు 2 నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు ఆర్యవైశ్య ఓపెన్ ఆడిటోరియంలో సాయంత్రం 4 గంటలకు వికారాబాద్ జిల్లా కవులతో కవి సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ఊరు, బాల్యం, జీవన విధానం, వృత్తులు, భాషా, సంస్కృతి, కళలు, ప్రకృతి వాటిపై కవితాంశం ఉంటుందని పేర్కొన్నారు. కవులు తమ కవితలు మూడు నిమిషాల కంటే ఎక్కువ చదవరాదని, కవి ఒక పేజీకి మించరాదని, ప్రక్రియ వచన కవిత, గేయ పద్యం ఏదైనా చదవచ్చని తెలిపారు. కవులు కవితాశుద్ధప్రతిని సమర్పించాలని, కవిత ఉన్న పేజీపై చిరునామా, పాస్‌ఫోటో సైజ్ ఫోటో, కవులు అధికసంఖ్యలో పాల్గొ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. పాల్గొన్న కవులందరికీ ప్రశంసాపత్రాలతో పాటు శాలువాలతో సన్మానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధానకార్యదర్శి అమ్మంగి వేణుగోపాల్, నవీన్‌చారి పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కవితా సమ్మేళనంలో పాల్గొనదలచిన కవులు, వేధావులు 9440842663 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

నీలి విప్లవానికి.. వరుణ గండం



- ఆశలన్నీ వరుణుడిపైనే
- నీరు లేక వెలవెలబోతున్న చెరువులు, కుంటలు
- ఈ ఏడాది 94.68 లక్షల చేప పిల్లలు వదిలేలా కార్యాచరణ
- గత ఏడాది కంటే మూడు రెట్ల లక్ష్యం నిర్దేశించుకున్న మత్స్య శాఖ
- 10 ప్రాజెక్టులు సహా 92 శాఖాపరమైన చెరువులు 600లకు పైగా గ్రామ పంచాయతీ చెరువుల్లో పెంపకానికి నిర్ణయం
- ప్రస్తుతం ఒక్క కోట్‌పల్లి ప్రాజెక్టులోనే నీరు

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్): చేప పిల్లల పంపిణీకి పెద్ద కష్టం వచ్చింది.. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి చేపల పెంపకానికి అనువుగా నీరు చేరుకోకపోవడంతో చేప పిల్లల పంపిణీకి ఇబ్బందికరంగా పరిణమించింది. వరుణుడు కరుణించకపోవడంతో జిల్లాలోని సాగునీటి వనరులు, చెరువులు, కుంటలు నీరు లేక వెలవెలబోతున్నాయి. వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా జిల్లాలో సరిపడా వర్షాలు కురియక ఆశించిన స్థాయి లో నీరు చేరుకోలేదు. కురిసిన వర్షాలతో కొన్ని చెరువులు, కుంటల్లో మాత్రమే కొంత మేరకు మాత్రమే నీరు చేరుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత చేప పిల్ల ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రభుత్వం ప్రారంభిస్తోంది. సింగూర్ ప్రాజెక్టులో చేప పిల్లలను వదిలి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అయితే జిల్లాలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. నీటి వనరుల్లోకి చేప పిల్లల వదలాలంటే నీటి నిలువ సామర్థ్యంలో కనీసం 33 శాతమైనా నీరు ఉండాలి. జిల్లాలో ఒక్క కోట్‌పల్లి ప్రాజెక్టు మినహా మిగతా ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో కూడా చేప పిల్లలు వదలలేని పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో చేపల పెంపకానికి ప్రస్తుతం కోట్‌పల్లి ప్రాజెక్టు ఒక్కటే సిద్ధంగా ఉంది. భారీ వర్షాలు కురిసి ప్రాజెక్టులు, చెరువుల్లోకి నీరు చేరితే గానీ చేప పిల్లలు వదలలేని పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో మత్స్య శాఖ పరిధిలో కోట్‌పల్లి, లక్నాపూర్, నందివాగు, సర్పన్‌పల్లి, కొంశెట్‌పల్లి, అల్లాపూర్, జుంటుపల్లి, చిన్నవాగు, కక్రవేణి, శ్రీ రాముల వారి ప్రాజెక్టులతో పాటు మొత్తం 92 చెరువులు ఉన్నాయి. అంతే కాకుండా 600లకు పైగా గ్రామ పంచాయతీ చెరువులను చేపల పెంపకానికి గుర్తించారు. జిల్లాలో 93 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. ఈ ఏడాది జిల్లా పరిధిలోని నీటి వనరుల్లో 94.68 లక్షల చేప పిల్లలను ఉచితంగా వదిలే విధంగా జిల్లా మత్స్య శాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. గత ఏడాది జిల్లాలో 30 లక్షల చేప పిల్లలను వదలగా, 1700 టన్నుల చేప పిల్లలు ఉత్పత్తి అయ్యాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది మూడు రెట్ల సంఖ్యలో చేప పిల్లలను వదలాలని జిల్లా మత్స్య శాఖ నిర్ణయించగా, చేప పిల్లలను వదలడానికి అవకాశం లేకుండా నీరు లేక వనరులు వెలవెలబోతున్నాయి. భారీ వర్షాలు కురియకపోతే చెరువులు, కుంటల్లో చేప పిల్లలు వదలలేని పరిస్థితి ఏర్పడుతుంది. వరుణుడు కరుణించి భారీ వర్షాలు కురి పించాలని అధికారులు ఎదురు చూస్తున్నారు. వారం రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేసిన ప్రకటనతో మత్స్య శాఖ అధికారులు వరుణుడి కటాక్షం కోసం గంపెడాశతో ఎదురు చూస్తున్నా రు. చెరువుల్లోకి నీరు చేరిన తరువాతనే జిల్లాలో చేపలను చెరువులు, కుంటల్లోకి చేప పిల్లలను వదిలే కార్యక్రమం చేపట్టాలని జిల్లా మత్స్య శాఖ నిర్ణయించింది. పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే మాత్రం లక్ష్యం మేరకు చేప పిల్లలు వదలడం కష్ట సాధ్యమనేది స్పష్టమవుతోంది.

వచ్చే నెలలోనే చేప పిల్లల పంపిణీ

జిల్లాలో మత్స్య శాఖ పరిధిలో 10 ప్రాజెక్టులతో మొత్తం 92 సాగునీటి వనరులు, 600లకు పైగా గ్రామ పంచాయతీల చెరువులు ఉన్నాయి. ఈ ఏడాదిలో 94.68 లక్షల చేప పిల్లలను వదలాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.87 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ప్రాజెక్టుల్లో కట్ల, రోగు, బ్రిగాల రకాల చేప పిల్లలను వదిలేందుకు జిల్లా మత్స్య శాఖ సిద్ధం చేసింది. ప్రస్తుతం చేప పిల్లల పెంపకానికి అనువుగా ప్రాజెక్టులు, చెరువుల్లో నీరు లేని కారణంగా సెప్టెంబర్ నెలలో చేప పిల్లలను వదిలే కార్యక్రమం చేపట్టాలని జిల్లా మత్స్య శాఖ నిర్ణయించింది. వచ్చే నెలలోగా భారీ వర్షాలు కురిసి చెరువులు, ప్రాజెక్టుల్లోకి సమృద్ధిగా నీరు చేరితే చేప పిల్లలను వదిలే కార్యక్రమం సజావుగా కొనసాగనుంది. ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోతే మాత్రం ఈ ఏడాది చేపల పెంపకానికి పెద్ద కష్టం వచ్చినట్లే..

వెలవెలబోతున్న సాగునీటి వనరులు

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు కురిసాయి. ఓ మోస్తరు వర్షాలు కురియడంతో చెరువులు, కుంటల్లోకి నీరు రాలేదు. జూన్‌లో మురిపించిన వర్షాలు... జూలై, ఆగస్టు నెలల్లో మాత్రం మరిపించాయి. జూన్‌లో సరాసరి సాధారణ సరాసరి వర్షపాతం 108.3 ఎంఎం కాగా, 178.3 ఎంఎం మేరకు నమోదైంది. 65% ఎక్కువ వర్షపాతం నమోదైంది. కాగా, జూలై నెల సరాసరి వర్షపాతం 203.8 ఎంఎం ఉండగా, ఆ నెలలో కేవలం 97.5 ఎంఎం మేరకు వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెల సాధారణ సరాసరి వర్షపాతం 170.1 ఎంఎం నమోదు కావాల్సి ఉండగా, ఈనెల 29వ తేదీ వరకు 126.4 ఎంఎం మేరకు వర్షపాతం నమోదైంది. జూలై నెలలో సాధారణ వర్షపాతం కంటే 52 శాతం, ఆగస్టు నెలలో ఇప్పటి వరకు 26 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది.

నర్సరీల్లో కూరగాయల నారు



చేవెళ్ల రూరల్: చేవెళ్ల మండలంలో వాణిజ్య పంటలతో పాటు రైతులు కూరగాయల పంటలు పండిస్తారు. మరికొందరైతే కేవలం కూరగాయల పంటలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. ఖరీఫ్‌లో మండలంలో రైతులు సాధారణంగా పత్తి, కంది, మొక్కజొన్న పంటల తర్వాత తప్పని సరిగా టమాట, వంగ, మిర్చి, క్యాబేజి తదితర కూరగాయల పంటలపై ఆధారపడ్డారు. దీంతో టమాట సాగులో మండల ప్రసిద్ధిగాంచింది. అయితే టమాట పండించాడానికి ముందు భూమిని సిద్ధం చేశాక నాణ్యమైన టమాట విత్తనాలు కొనుగోలు చేసి వారి వారి చేలలోనే నారుమడికట్టి నారువేసి నారు మొలకెత్తాక తగిన సమయం చూసి విత్తుకుంటారు. అయితే ప్రస్తుతం దాదాపు రైతులు ఈ పద్ధతికి స్వస్తి చెబుతున్నారు. కారణం కొత్తగా వెలసిన కూరగాయల నారు అందించే నర్సరీలు వీటి ద్వారా రైతుల అవసరాలు తీర్చుకుంటున్నారు.

నర్సరీతో ఉపాధి.. రైతులకు ఊరట

హైదరాబాద్ నగరానికి చేవెళ్ల నియోజకవర్గం కూతవేటు దూరంలో ఉండటంతో చాలా మంది రైతులు కూరగాయల పంటలను సాగు చేసి నగరంలోని మార్కెట్‌కు తరలిస్తుంటారు. అయితే మండల కేంద్రాల్లో వెజిటెబుల్ నర్సరీని ఏర్పాటు చేసుకోని కూరగాయల నారును రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. వివిధ కారణాలతో నారును సకాలంలో సరైన పద్దతిలో వేసుకోలేని రైతులకు తాము కోరుకున్న రకం నారు దొరుకుతుండడంతో మండల రైతులే కాకుండా వివిధ గ్రామాల రైతులు సైతం నర్సరీల్లోని నారును కొనుగోలు చేసి అనుకూల సమయంలో నాటుకుంటున్నారు.

నర్సరీల్లో నారు ఇలా..

ఇక్కడ ఏర్పాటు చేసిన నర్సరీల్లో మిరప, టమాట, క్యాబేజీ, కాలీఫ్లవర్, వంకాయ తదితర కూరగాయలతో పాటు రైతుల కోరిక మేరకు పూల మొక్కల నారును సైతం ఆర్డరుపై అందిస్తున్నారు. గ్రామంతో పాటు సమీప మండలాల్లో కూరగాయల సాగు ఉండడంతో ఇక్కడ నారు నర్సరీని ఏర్పాటు చేశారు. దీని ద్వారా పలువురు ఉపాధి పొందుతున్నారు. ఏడాది పొడువునా రైతులకు కావాల్సిన నారును అందుబాటులో ఉంచుతున్నారు.

సౌకర్యంగా ఉంది



మేము నారు వేసుకోవాలంటే మడి కట్టి విత్తనాలు విత్తుకోవాలి. వాతావరణం సహకరించక పోతే విత్తనాలు ఎరువులు, చేసిన కష్టంతో పాటు సమయం వృథా అవుతుంది. మేము వేసినా నారుకు తెగుళ్ల బెడద సైతం ఎక్కువ అందుకే నర్సరీ నారుపై ఆధార పడాల్సి వస్తోంది. కావాల్సిన సీడ్ విత్తనాల నారు అందిస్తున్నారు. దీంతో నాటే రోజే నారు తెచ్చుకోని నాట్లు వేసుకుంటున్నాం.

- జాఫర్, ఉప సర్పంచ్, మల్కాపూర్

భూసార పరీక్షలు చేసుకోవాలి

- రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి
- కాలనుగుణంగా వ్యవసాయ మెలకువలు పాటించాలి
- వ్యవసాయ శాస్త్రవేత్తల వెల్లడి..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సామల భాగ్యలక్ష్మి ఎల్లారెడ్డి

వికారాబాద్ అర్బన్: రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు విద్యాశేఖర్, శ్రీకృష్ణ, సుధీర్‌లు తెలిపారు. రైతులకు వ్యవసాయంపై సూచనలు అందజేసేందుకు మంగళవారం స్థానిక అంబేద్కర్ భవనంలో సంకల్పంతో సిద్ధి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎప్పటి కప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలతో వ్యవసాయం చేయాలన్నారు. కాలానుగుణంగా అనేక రకాల చీడపీడలతో పంటలు పాడయ్యే ప్రమాదం ఉందని, వీటి నివారణకు అవసరమైన క్రిమి సంహారక మందును వ్యవసాయాధికారుల సూచనల మేరకు పిచికారి చేయాలని వారు సూచించారు. మనం పిచికారి చేసే క్రిమి సంహారక మందు సైతం కాలను గుణంగా ఏ సమయంలో వాడాలో తెలుసుకోవాలని అన్నారు. వర్షం పడిన వెంటనే ఎట్టి పరిస్థితిలోనూ క్రిమి సంహారక మందులు పిచికారి చేయకూడదని, అదే విధంగా పిచికారి చేసిన వెంటనే వర్షం పడితే మనం పిచికారి చేసిన మందుకు ప్రయోజనం ఉండదన్నారు. మంచు పడే సమయంలో కూడా ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటలోపు క్రిమిసంహారక మందును పంటపై పిచికారి చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఎంపీపీ భాగ్యలక్ష్మి ఎల్లారెడ్డి మాట్లా డుతూ, దేశానికి అన్నం పెట్టేది రైతు అని, అలాంటి రైతులు నష్టాలు ఎదురై ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు ప్రకృతి వైపరీత్యాలతో, మరోవైపు దళారుల చేతిలో రైతులు నిత్యం నష్టపోతున్నారని వాపోయారు. రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చే యించుకుని, తమ పొలానికి సరిపోయే పంటలను వేసుకోవాలని ఆమె సూచించారు. ఏ కాలంలో ఏ పంటలను వేయాలో అధికారులను అడిగి తెలుసు కోవాలన్నారు. వర్షాలు కురియక ఇప్పటికే రైతులు మొక్కజొన్న పంటను నష్టపోయా రన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంత రైతులు అడవి పందులతో ఇబ్బందులు పడుతు న్నారని ఆమె చెప్పారు. అడవి పందులను రైతులు చంపితే వారికి జరిమానాలు విధిస్తు న్నారని, అవే పందులు పంట నష్టం చేస్తే మాత్రం రైతులకు ఎలాంటి పరిహారం అందజేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, ఏడీఏలు దివ్యజ్యోతి, విన్సెంట్ వినయ్‌కుమార్, ఏవో ప్రసన్నలక్ష్మి, జిల్లాలోని ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

'భిన్న పరీక్ష' నుంచి కచ్చితంగా ప్రశ్నలు

భిన్న పరీక్ష

ప్రస్తుత పోటీ పరీక్షల్లో భిన్న పరీక్ష విభాగానికి సంబంధించిన ప్రశ్నలు రెండు లేదా మూడు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఎస్‌ఐ తదితర పరీక్షల్లో ఈ విభాగం నుంచి 8 లేదా 10 ప్రశ్నలు కచ్చితంగా వస్తున్నాయి. కాబట్టి రీజనింగ్‌లో ఈ టాపిక్ చాలా ముఖ్యమైంది. ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో నాలుగు లేదా ఐదు పదాలు/ పదాల జతలు / సంఖ్యలు/ వర్ణమాల అక్షరాల సమూహాలను ఇస్తారు. ప్రశ్న & సమాధానాలుగా ఇచ్చే ఎ, బి, సి, డిల్లో ఒకటి మినహా మిగిలినవన్నీ ఒకే లక్షణంతో ఉంటాయి. ఆ విధంగా భిన్నంగా ఉండే పదం/ పదాల జత/ సంఖ్య/ వర్ణమాల అక్షరాల సమూహాన్ని సమాధానంగా గుర్తించాలి. అంటే ఇచ్చిన ఎ, బి, సి, డిల్లో భిన్నంగా ఉన్న దానిని తొలగించాలి.

ఈ విభాగంలో మూడు మోడల్స్ ఉన్నాయి. అవి..

1. పదాలతో భిన్న పరీక్ష
2. భిన్నమైన సంఖ్యను కనుక్కోవడం
3. భిన్నమైన వర్ణమాల అక్షరాల సమూహాన్ని గుర్తించడం

మోడల్ - 1
పదాలతో భిన్న పరీక్ష

ఇందులో రెండు రకాలు ఉన్నాయి. అవి..

టైప్ 1: నాలుగు పదాలు ఇచ్చి భిన్నమైన దానిని సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 2: నాలుగు పదాల జతలను ఇచ్చి భిన్నమైన జతను సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 1

1. ఎ) భరతనాట్యం బి) కూచిపూడి సి) భాంగ్రా డి) యక్షగానం
సమాధానం: సి
వివరణ: భాంగ్రా మినహా మిగిలినవన్నీ శాస్త్రీయ నృత్యాలు. భాంగ్రా జానపద నృత్యం.

2. ఎ) అక్టోబరు బి) నవంబరు సి) డిసెంబరు డి) జనవరి
సమాధానం: బి
వివరణ: నవంబరు మినహా మిగిలిన నెలలకు నెలకు రోజులు 31. కానీ, నవంబరు నెలలో 30 రోజులు మాత్రమే ఉంటాయి.

3. ఎ) ముఖ్యమంత్రి బి) లోక్‌సభ సభ్యుడు సి) రాజ్యసభ సభ్యుడు డి) ప్రధానమంత్రి
సమాధానం: ఎ
వివరణ: ముఖ్యమంత్రి మినహా మిగిలిన వ్యక్తులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వారు.

4. ఎ) కోహిమా బి) ఇంఫాల్ సి) అగర్తల డి) పట్నా
సమాధానం: డి
వివరణ: పట్నా మినహా మిగిలినవన్నీ వివిధ ఈశాన్య రాష్ట్రాల రాజధానులు

5. ఎ) పెల్లాగ్రా బి) బెరిబెరి సి) ఎనీమియా డి) గాయిటర్
సమాధానం: డి
వివరణ: గాయిటర్ మినహా మిగిలనవన్నీ విటమిన్ లోపంతో వస్తాయి. కానీ, గాయిటర్ వ్యాధి మాత్రం అయోడిన్ లోపంతో వస్తుంది.

6. ఎ) బ్యాడ్మింటన్ బి) చెస్ సి) క్యారమ్స్ డి) బిలియర్డ్స్
సమాధానం: ఎ
వివరణ: బ్యాడ్మింటన్ తప్ప మిగిలినవి ఇండోర్ గేమ్స్

7. ఎ) మే బి) జూన్ సి) జూలై డి) ఆగస్టు
సమాధానం: బి
వివరణ: జూన్ మినహా మిగిలిన అన్ని నెలలకు నెలకు 31 రోజులు ఉంటాయి.

8. ఎ) నైల్ బి) ఓల్గా సి) నయాగరా డి) అమెజాన్
సమాధానం: సి
వివరణ: నయాగరా మినహా మిగిలినవన్నీ నదుల పేర్లు. నయాగరా అనేది జలపాతం.

9. ఎ) గుండె బి) నేత్రం సి) చెవి డి) కాలు
సమాధానం: ఎ
వివరణ: గుండె తప్ప మిగిలినవి జతగా ఉంటాయి.

10. ఎ) నియాసిన్ బి) ట్రిప్సిన్ సి) థయామిన్ డి) రైబోఫ్లోవిన్
సమాధానం: ఎ



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

వివరణ: ట్రిప్సిన్ మినహా మిగిలినవన్నీ విటమిన్ పేర్లు. ట్రిప్సిన్ అనేది ఎంజైమ్.

11. ఎ) బంతి బి) చేమంతి సి) తామర డి) గులాబి
సమాధానం: సి
వివరణ: తామర మినహా మిగిలిన పువ్వులన్నీ భూమి మీద పెరుగుతాయి. తామర నీటిలో పెరుగుతుంది.

12. ఎ) పోలెండ్ బి) గ్రీస్ సి) స్పెయిన్ డి) కొరియా
సమాధానం: డి
వివరణ: కొరియా మినహా మిగిలిన దేశాలు యూరప్ ఖండంలోనివి. కానీ, కొరియా ఆసియా ఖండానికి సంబంధించిన దేశం.

13. ఎ) చెన్నై బి) హైదరాబాద్ సి) బెంగళూరు డి) లక్నో
సమాధానం: డి
వివరణ: లక్నో మినహా మిగిలినవన్నీ వివిధ దక్షిణ భారత రాష్ట్రాల రాజధానులు. లక్నో మాత్రం ఉత్తర భారతంలోని రాష్ట్రానికి సంబంధించిన రాజధాని.

14. ఎ) కివి బి) గద్ద సి) పెంగ్విన్ డి) ఆస్ట్రిచ్
సమాధానం: బి
వివరణ: గద్ద మినహా మిగిలిన పక్షులు ఎగరలేనివి. గద్ద ఎగిరే పక్షి.

15. ఎ) గోధుమ బి) ఆవాలు సి) వేరుశనగ డి) వరి
సమాధానం: డి
వివరణ: వరి మినహా మిగిలినవన్నీ రబీ పంటలు. వరి ఖరీఫ్ పంట

16. ఎ) బైకాల్ బి) ధాల్ సి) చిలక డి) థార్
సమాధానం: డి
వివరణ: థార్ మినహా మిగిలినవన్నీ వివిధ సరస్సుల పేర్లు. థార్ అనేది ఎడారి.

17. ఎ) కోణార్క్ బి) మధురై సి) ఎల్లోరా డి) దిల్వారా
సమాధానం: సి
వివరణ: ఎల్లోరా మినహా మిగిలినవన్నీ ప్రసిద్ధ దేవాలయాలు ఉన్న ప్రదేశాలు. ఎల్లోరా ప్రసిద్ధ గుహలు ఉన్న ప్రదేశం

18. ఎ) రుగ్వేదం బి) ఆయుర్వేదం సి) సామవేదం డి) యజుర్వేదం
సమాధానం: బి
వివరణ: ఆయుర్వేదం మినహా మిగిలినవి వేదాలు. ఆయుర్వేదం అనేది వైద్య శాస్త్రం.

19. ఎ) గ్రానైట్ బి) లిగ్నైట్ సి) ఆంత్రసైట్ డి) బిటూమినస్
సమాధానం: ఎ
వివరణ: గ్రానైట్ మినహా మిగిలినవి బొగ్గు రూపాంతరాలు. గ్రానైట్ అనేది విలువైన రాయి.

20. ఎ) సంతాల్స్ బి) ఖోండ్స్ సి) అబోర్స్ డి) డోగ్రి
సమాధానం: డి
వివరణ: డోగ్రి మినహా మిగిలినవన్నీ వివిధ గిరిజన జాతులు. డోగ్రి అనేది ఒక భాష.

21. ఎ) కాలువ బి) వంతెన సి) ప్రవాహం డి) సెలయేరు
సమాధానం: బి
వివరణ: వంతెన మినహా మిగిలినవి నీటితో ఉంటాయి.

22. ఎ) నేపాల్ బి) టోక్యో సి) కాబూల్ డి) బీజింగ్
సమాధానం: ఎ
వివరణ: నేపాల్ మినహా మిగిలినవి వివిధ దేశాల రాజధానులు. నేపాల్ అనేది ఒక దేశం.

23. ఎ) మహావీరుడు బి) గౌతమబుద్ధుడు సి) మహాత్మాగాంధీ డి) గురునానక్
సమాధానం: సి
వివరణ: మహాత్మాగాంధీ మినహా మిగిలిన వారు ప్రసిద్ధ మతాల స్థాపకులు.

24. ఎ) రాజీవ్‌గాంధీ బి) జవహర్‌లాల్ నెహ్రూ సి) చరణ్ సింగ్ డి) బాబూ రాజేంద్రప్రసాద్
సమాధానం: డి
వివరణ: బాబూ రాజేంద్రప్రసాద్ మినహా మిగిలినవారు ప్రధానమంత్రులు. బాబూ రాజేంద్ర ప్రసాద్ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు.

25. ఎ) పాదరసం బి) ఆక్సిజన్ సి) మెగ్నీషియం డి) సోడియం
సమాధానం: ఎ
వివరణ: నాలుగూ మూలకాలే. కానీ, పాదరసం ద్రవరూప మూలకం.

26. ఎ) కలం బి) నల్లబల్ల సి) కాగితం డి) పలక
సమాధానం: ఎ
వివరణ: కలం మినహా మిగిలిన వాటిపై వివిధ వస్తువులతో రాయవచ్చు. కలం మాత్రం రాయడానికి ఉపయోగించేది.

27. ఎ) గారో బి) ఖాశీ సి) కాంగ్రా డి) జెంతియా
సమాధానం: సి
వివరణ: కాంగ్రా మినహా మిగిలినవి కొండలు. కాని, కాంగ్రా లోయ.

28. ఎ) జూన్ బి) సెప్టెంబరు సి) నవంబరు డి) ఆగస్టు
సమాధానం: డి
వివరణ: ఆగస్టు మినహా మిగిలిన నెలలకు నెలకు 30 రోజులు ఉంటాయి. ఆగస్టు నెలకు మాత్రం 31 రోజులు ఉంటాయి.

29. ఎ) మార్చి బి) జూలై సి) ఆగస్టు డి) మే
సమాధానం: సి
వివరణ: అన్ని నెలలకు 31 రోజులు ఉన్నాయి. మార్చి 3వ నెల, జూలై 7వ నెల, మే 5వ నెల అంటే మార్చి, మే, జూలై బేసి నెలలు. ఆగస్టు అనేది 8వ నెల అంటే సరి సంఖ్యకు సంబంధించిన నెల.

30. ఎ) నారింజ బి) పసుపు సి) ఆకుపచ్చ డి) గులాబి
సమాధానం: డి
వివరణ: గులాబీ మినహా మిగిలినవి ఇంద్రధనస్సు రంగుల్లో ఉంటాయి.

31. ఎ) న్యూటన్ బి) మార్కోని సి) బీతావన్ డి) పారడే
సమాధానం: సి
వివరణ: బీతావన్ మినహా మిగిలిన వ్యక్తులు శాస్త్రవేత్తలు.

32. ఎ) క్యారట్ బి) అల్లం సి) బీట్‌రూట్ డి) ఆనపకాయ
సమాధానం: డి
వివరణ: ఆనపకాయ మినహా మిగిలిన కూరగాయలు భూమి నుంచి వస్తాయి.

33. ఎ) గుండె బి) చెవి సి) ముక్కు డి) నేత్రాలు
సమాధానం: ఎ
వివరణ: గుండె మినహా మిగిలినవి జ్ఞానేంద్రియాలు.

34. ఎ) బిందుసారుడు బి) బింబిసారుడు సి) అశోకుడు డి) సంప్రాప్తి
సమాధానం: బి
వివరణ: బింబిసారుడు మినహా మిగిలిన వ్యక్తులు మౌర్య వంశానికి చెందిన వారు. బింబిసారుడు హర్యంక వంశానికి వ్యక్తి.

35. ఎ) దాద్రానగర్ హవేలీ బి) అండమాన్ నికోబార్ దీవులు సి) పాండిచ్చేరి డి) జార్ఖండ్
సమాధానం: డి
వివరణ: జార్ఖండ్ మినహా మిగిలినవి కేంద్ర పాలిత ప్రాంతాలు. జార్ఖండ్ అనేది రాష్ట్రం పేరు.

36. ఎ) బుల్లి బి) కార్నర్ సి) బంకర్ డి) డ్రిబుల్
సమాధానం: సి
వివరణ: బంకర్ మినహా మిగిలిన పదాలు హాకీ క్రీడకు సంబంధించినవి.

37. ఎ) బీర్బల్ బి) ఫైజ్ అహ్మద్ సి) అబుల్ ఫజల్ డి) తాన్‌సేన్
సమాధానం: బి
వివరణ: ఫైజ్ అహ్మద్ మినహా మిగిలిన వ్యక్తులు అక్బరు ఆస్థానానికి చెందిన వారు.

38. ఎ) ఆసియా బి) అర్జెంటీనా సి) ఆఫ్రికా డి) ఆస్ట్రేలియా
సమాధానం: బి
వివరణ: అర్జెంటీనా మినహా మిగిలినవి ఖండాల పేర్లు

39. ఎ) మెరీనా బి) జెర్సోప్పా సి) విక్టోరియా డి) ఏంజెల్
సమాధానం: ఎ
వివరణ: మెరీనా మినహా మిగిలినవి జలపాతాలు. మెరీనా అనేది ఒక బీచ్.

JOBS ఉద్యోగాలు

సిడాక్

నొయిడాలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 67

ప్రాజెక్ట్ మేనేజర్ **ఖాళీలు:** 2
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీతో పదకొండేళ్లు/ పీజీతో ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 50 ఏళ్లు మించరాదు

ప్రాజెక్ట్ ఇంజనీర్ **ఖాళీలు:** 65
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం మూడు నుంచి ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 37 ఏళ్లు మించరాదు
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 23
దరఖాస్తు ఫీజు: రూ.500
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న తరవాత హార్డు కాపీని నిర్దేశిత చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:సెప్టెంబరు 18
చిరునామా: Section in Charge(HR - II), Ce ntre for Development of Advanced Comp uting(CDAC), Academic Block, B - 30, Institutional Area, Sector - 62, Noida - 201307
వెబ్‌సైట్: http://cdac.in/

ఎస్ఎస్‌సి ఎస్ఆర్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ సదరన్ రీజియన్ (ఎస్ఎస్‌సి ఎస్ఆర్) - కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 66

టెక్నికల్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 3
అర్హత: డిప్లొమా (హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ టెక్నాలజీ) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 30 ఏళ్లు మించరాదు.

వర్క్‌షాప్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 1
అర్హత: బిఇ/ బిటెక్ (మెకానికల్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ (వీవింగ్) **ఖాళీలు:** 1
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (టెక్స్‌టైల్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ ఇంజ నీరింగ్)/ డిప్లొమా(హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్ టైల్ టెక్నాలజీ/ హ్యాండ్లూమ్ & టెక్స్‌టైల్ టెక్నాలజీ) ఉత్తీర్ణతతోపాటు అనుభవం కూడా ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 34
అర్హత: 10వ తరగతి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

లేడీ మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 15
అర్హత: 10వ తరగతితోపాటు ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

కన్జర్వేషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 2
అర్హత: 10వ తరగతితోపాటు డిప్లొమా(సివిల్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 9
అర్హత: 10వ తరగతితోపాటు ఐటిఐ సర్టిఫికెట్ (సివిల్ ఇంజనీరింగ్) ఉండాలి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

ఎవల్యూషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 1
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (స్టాటిస్టిక్స్/ మేథమెటిక్స్/ ఎకనామిక్స్/ సోషియాలజీ/ సోషల్ వర్క్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:సెప్టెంబరు 24
దరఖాస్తు హార్డు కాపీ పంపేందుకు చివరి తేదీ: అక్టోబరు 4
వెబ్‌సైట్: www.sscsr.gov.in

రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?

భారత రాష్ట్రపతి

1. **భారతదేశ రాజ్యాంగ అధినేత అయిన రాష్ట్రపతి గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పొందుపరిచారు?**
ఎ) మూడో భాగం 12 - 35 ఆర్టికల్
బి) నాలుగో భాగం 36 - 51 ఆర్టికల్
సి) ఐదో భాగం 52 - 62 ఆర్టికల్
డి) ఆరో భాగం 152 - 161 ఆర్టికల్

2. **భారతదేశ ప్రథమ పౌరుడు అని ఎవర్ని అంటారు?**
ఎ) రాష్ట్రపతి బి) అటార్నీ జనరల్ సి) గవర్నర్
డి) సుప్రీంకోర్టు ప్రధాన నాయ్యమూర్తి

3. **భారతదేశానికి ఒక రాష్ట్రపతి ఉంటాడు అని తెలిపే ఆర్టికల్?**
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ

4. **భారత రాజ్యాంగాన్ని, చట్టాలను సంరక్షించే బాధ్యత ఎవరికి కల్పించారు?**
ఎ) పార్లమెంట్ బి) సుప్రీం కోర్టు
సి) ప్రధానమంత్రి డి) రాష్ట్రపతి

5. **భారతదేశ సర్వసైన్యాధ్యక్షుడు ఎవరు?**
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) సైనిక దళాధిపతి డి) పైవారందరూ

6. **కేంద్ర ప్రభుత్వంలో అన్ని కార్యనిర్వాహక సంబంధ, ఒప్పందాలు ఎవరి పేరు మీద జరుగుతాయి?**
ఎ) ప్రధానమంత్రి బి) కేంద్ర కేబినెట్
సి) రాష్ట్రపతి డి) కేంద్ర శాసనసభ

7. **భారత రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ అధినేత ఎవరు?**
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) కేంద్ర మంత్రిమండలి డి) పైవారందరూ

8. **రాష్ట్రపతిని ఎవరు ఎన్నుకొంటారు?**
ఎ) పార్లమెంట్‌కు ఎన్నికైన ఉభయసభ సభ్యులు
బి) ఎలక్ట్రోరల్ కాలేజ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనసభ సభ్యులు మాత్రమే
డి) పైవారందరూ

9. **రాష్ట్రపతి ఎన్నిక, ఎన్నిక విధానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?**
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) ఐర్లాండ్ డి) రష్యా

10. **రాష్ట్రపతి ఎన్నిక విధానాలను రాజ్యాంగ పరిషత్తులో ప్రతిపాదించిన వారు?**
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
బి) గోపాలస్వామి అయ్యంగార్
సి) బి.ఎన్.రావు డి) కె.ఎం.మున్షీ

11. **భారత రాష్ట్రపతిని ఏ దేశ రాజు లేదా రాణితో పోలుస్తారు?**
ఎ) బ్రిటన్ బి) నేపాల్ సి) భూటాన్ డి) ఫ్రాన్స్

12. **రాష్ట్రపతి ఎన్నిక విధానం గురించి రాజ్యాంగంలోని ఏ అధికరణం తెలుపుతుంది?**
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ

13. **రాష్ట్రపతి ఎవరి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేస్తారు?**
ఎ) ఉపరాష్ట్రపతి బి) లోక్‌సభ స్పీకర్
సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
డి) ఎవరూ కాదు

14. **రాష్ట్రపతి పదవికి పోటీ చేసే వ్యక్తి కనీస వయసు?**
ఎ) 30 ఏళ్లు నిండి ఉండాలి
బి) 31 ఏళ్లు నిండి ఉండాలి
సి) 33 ఏళ్లు నిండి ఉండాలి
డి) 35 ఏళ్లు నిండి ఉండాలి

15. **రాజ్యాంగంలో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఢిల్లీ, పాండిచ్చేరి (కేంద్ర పాలిత ప్రాంతాలు) రాష్ట్రపతి ఎన్నికల్లో పాలుపంచుకొంటున్నాయి?**
ఎ) 1992, 70వ రాజ్యాంగ సవరణ
బి) 1992, 73వ రాజ్యాంగ సవరణ
సి) 1992, 74వ రాజ్యాంగ సవరణ
డి) 1976, 42వ రాజ్యాంగ సవరణ

16. **షెడ్యూల్డ్ కులాలను నిర్ణయించే అధికారం ఎవరికి ఉంటుంది?**
ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
సి) జాతీయ ఎస్సీ కమిషన్
డి) కేంద్రమంత్రి మండలి

17. **పార్లమెంట్ సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం ఎవరికి ఉంటుంది?**
ఎ) కేంద్ర ఎన్నికల సంఘం
బి) సభాధ్యక్షుడు
సి) రాష్ట్రపతి డి) సుప్రీం కోర్టు

18. **రాష్ట్రపతి పదవీకాలం?**
ఎ) నాలుగు సంవత్సరాలు
బి) ఐదు సంవత్సరాలు
సి) ఆరు సంవత్సరాలు డి) ఏదీకాదు

19. **రాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఎవరు వ్యవహరిస్తారు?**
ఎ) ఎన్నికల అధికారి బి) కలెక్టర్
సి) లోక్‌సభ సెక్రటరీ జనరల్ డి) లోక్‌సభ స్పీకర్



కొమ్ము సుందర్‌రాజు
పాలిటీ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ



20. **రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనని సభ్యులు?**
ఎ) లోక్‌సభకు నామినేట్ అయ్యే ఇద్దరు ఆంగ్లో ఇండియన్లు
బి) రాజ్యసభలోని 12 మంది నామినేటెడ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనమండలి (విధానపరిషత్తు) సభ్యులందరూ డి) పైవారందరూ

21. **లోక్‌సభలో ఏ పార్టీకి, ఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ లేనప్పుడు ప్రధాని నియామకంలో రాష్ట్రపతి ఏ అధికారాలు కలిగి ఉంటాడు?**
ఎ) విచక్షణాధికారాలు బి) కార్యనిర్వహణాధికారాలు
సి) న్యాయాధికారాలు డి) అత్యవసరాధికారాలు

22. **రాష్ట్రపతికి తన అధికార-విధుల నిర్వహణలో సహాయ, సలహాలు అందించడానికి ప్రధాని నేతృత్వంలో ఒక మంత్రి మండలి ఉంటుంది అని తెలిపే అధికరణం?**
